


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 426 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 19 మే 2025 | వెల : 4/-


# గుల్జార్ హౌస్ లో అగ్నిప్రమాదం..17 మంది మృతి

**8 మంది చిన్నారులే..**

**హైదరాబాద్,,మే18 (సూర్యరేఖ)** చార్మినార్ గుల్జార్ హౌస్ సమీపంలోని భవనంలో జరిగిన ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది.భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగడంతో 17 మంది మృతిచెందారు.ఈ భవనం మొదటి అంతస్తులో వ్యాపారి కుటుంబం నివాసముంటోంది.గ్రౌండ్ ఫ్లోర్లో నగల దుకాణం నిర్వహిస్తున్నారు.వేసవి సెలవుల సందర్భంగా వ్యాపారి వద్దకు బంధువులు వచ్చారు.మంటలు చెలరేగడంతో ఇంట్లో పొగ కమ్ముకుంది. దీంతో ఊపిరాడక పలువురు స్పృహ తప్పి పడిపోయారు.ఘటనాస్థలికి చేరుకున్న సహాయక బృందాలు మంటలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించాయి. ఇంట్లోకి పొగ చేరడం..ఒకే మెట్ల మార్గం ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది.నిచ్చెనలతో మొదటి అంతస్తులోకి అగ్నిమాపక సిబ్బంది వెళ్లారు. ఇంట్లోకి చేరే మార్గం లేక తలుపులు పగులగొట్టి స్పృహ తప్పి ఉన్న పలువురిని బయటకు తీసుకొచ్చారు.పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది..మంటలను అదుపుచేశారు.గాయపడినవారిని మలక్‌పేట యశోద హైదర్‌గూడ అపోలో,డీఆర్‌డీఎల్ అపోలో,ఉస్మానియా,నాంపల్లి కేర్ హాస్పిటల్లకు తరలించారు. ఘటనా స్థలంలోనే ముగ్గురు మరణించగా,మిగిలినవారు దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందారు.

**- మృతులు..**

అగ్నిప్రమాదంలో మరణించినవారిని ఆరుషి జైన్ (17),షీతల్ జైన్ (37),సుమిత్ర (65),మున్ని బాయి (72),ప్రథమ్ (13),అభిషేక్ మోడీ (30), రాజేంద్ర కుమార్ (67),ఇరాజ్ (2),ప్రియాన్షి (6),హర్షలి గుప్తా (7),ఇదిక్కి (4),అన్య (3), పంకజ్ (36),వర్ష (35), రజని అగర్వాల్ (32), రిషభ్ (4),ప్రీతం అగర్వాల్ (1)గా గుర్తించారు.

**ముఖ్యమంత్రి ఆరా..**

గుల్జార్ హౌస్ అగ్నిప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మంటల్లో



చిక్కుకున్న వారిని కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పోలీస్, ఫైర్ విభాగం చేపడుతన్న చర్యలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారు.గాయపడిన వారిని వెంటనే హాస్పిటల్స్‌కు తరలించి మెరుగైన వైద్య సాయం అందించాలని ఆదేశించారు.బాధితులకు అండగా ఉంటామన్నారు.బాధితులతో ఫోన్‌లో మాట్లాడారు.ప్రమాద ఘటనపై హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆరా తీశారు.వెంటనే ఘటనా స్థలానికి వెళ్లాలని సూచించారు.

**–అగ్నిమాపక సిబ్బందికి సరైన శిక్షణ అందించాలి: కిషన్ రెడ్డి**

అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పరిశీలించారు.అధికారులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు.ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రమాదం జరిగిందని చెప్పారు.సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది ఆలస్యం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారని తెలిపారు.చిన్న ప్రమాదమే అయినా..ప్రాణ నష్టం ఎక్కువగా ఉందన్నారు.అగ్నిమాపక సిబ్బందికి ప్రభుత్వం సరైన పరికరాలు,శిక్షణ అందించాల్సి ఉందని




చెప్పారు.అగ్నిమాపక శాఖ సాంకేతికతను మెరుగుపరుచుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.బాధిత కుటుంబాలకు కేంద్రం తరఫున సాయం అందిస్తామని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

**–ఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం..**

దీంతో అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు.ప్రమాద కారణాలపై అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి సౌత్‌జోన్ డీసీపీ స్నేహా మిశ్రా నుంచి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఉదయం 6.16 గంటల సమయంలో ఫైర్ సిబ్బందికి సమాచారం అందిందని చెప్పారు. వెంటనే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారని మంటలను ఆర్పేశారు. అగ్నిప్రమాదంలో 17 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారని వెల్లడించారు.వారిలో ఎక్కువ మంది మరణించారని తెలిపారు.బాధితులకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామన్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సీఎం ఆదేశారని తెలిపారు.ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామన్నారు. అగ్ని ప్రమాదంలో కుట్ర కోణం లేదని, ప్రమాద వశాత్తు జరిగిందని చెప్పారు.ఏ అధికారి నిర్లక్ష్యం చేయకుండా ప్రమాద తీవ్రతను తగ్గించారు. చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. చనిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం సంతాపం తెలుపుతున్నది.ఘటనలో 17 మంది ఉన్నారని, ఎంతమంది చనిపోయారనేది అధికారికంగా తెలియాల్సి ఉందని చెప్పారు.



# లష్కరే టాప్ టెర్రరిస్ట్ సైపుల్లా ఖలీద్ హతం

- పాకిస్థాన్‌లో ఖలీద్‌ను కాల్చిచంపిన గుర్తు తెలియని వ్యక్తులు
- 2006లో నాగపూర్ ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో ఖలీద్ సూత్రధారి.
- నాగపూర్, రాంపూర్, బెంగుళూరు దాడుల్లో ఖలీద్ హస్తం



# సచివాలయంలో ప్రపంచ సుందరీమణుల సందడి

- అత్యంత విశాలంగా.. అద్భుతమైన సెక్రటేరియట్‌ను చూసి ఆశ్చర్య వ్యక్తం చేసిన కంటెస్టెంట్లు..
- సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేసిన సుందరీమణుల
- తెలంగాణ తల్లి ముందు ర్యాంప్ వాక్
- కంటెస్టెంట్లు ప్రయాణించే రహదారులన్నీ రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరణ

# నేటి నుంచే భూముల రీసర్వే!

- రెవెన్యూ వర్గాల ఆందోళన
- కేంద్రం మార్గదర్శకాల మేరకు నిర్వహించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- పైలట్ పద్ధతిలో 5 గ్రామాల ఎంపిక.. 3 ఏజెన్సీలకు బాధ్యతలు
- ఇప్పటికే పూర్తయిన గ్రామాల సరిహద్దుల సర్వే
- కొత్త సమస్యలు వస్తాయేమోనని రెవెన్యూ వర్గాల ఆందోళన




**హైదరాబాద్**

ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని పైలట్ పద్ధతిలో భూముల రీసర్వేకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్ (డీఐఎల్ఆర్ఎంపీ) మార్గదర్శకాలకు అనుగుణంగా డ్రోన్లు లేదా ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతి ద్వారా ఎంపిక చేసిన ఐదు గ్రామాల్లో ఈ సర్వే సోమవారం నుంచి నిర్వహించనుంది. ఇందు కోసం ఆయా గ్రామాల్లో 4–5 రోజులుగా భూముల సరిహద్దుల నిర్ధారణ జరుగుతుండగా రేపట్నుంచి సర్వే బృందాలు అక్కడకు వెళ్లనున్నాయి. ముందుగా మహబూబ్‌నగర్ జిల్లా - మిగతా3లో

# పాకిస్థాన్‌కు నిధులతో పాటే 11 షరతులు కూడా విధించిన ఐఎంఎఫ్!

ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి మరోసారి షాకిచ్చింది. బెయిలౌట్ కార్యక్రమంలో భాగంగా తదుపరి విడత నిధుల విడుదల కోసం 11 కొత్త షరతులను విధించింది. అంతేకాకుండా, భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలు ఈ పథకం నిర్దేశించుకున్న ఆర్థిక, విదేశీ, సంస్కరణల లక్ష్యాలకు ప్రమాదం కలిగించవచ్చని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు ఒక మీడియా కథనం వెల్లడించింది. పాకిస్థాన్‌పై తాజాగా విధించిన షరతుల్లో రూ. 17.6 ట్రిలియన్ల కొత్త బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం పొందడం, విద్యుత్ బిల్లులపై రుణ సేవా సర్ చార్జ్‌ని పెంచడం, మూడేళ్లకు పైబడిన పాత కార్ల దిగుమతిపై ఆంక్షలను ఎత్తివేయడం వంటివి ఉన్నాయని 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' పత్రిక తెలిపింది. శనివారం ఐఎంఎఫ్ విడుదల చేసిన స్టాఫ్ లెవల్ నివేదికలో ఈ వివరాలు ఉన్నాయని పేర్కొంది. "భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగితే లేదా మరింత క్షీణిస్తే, కార్యక్రమ ఆర్థిక, విదేశీ, సంస్కరణల లక్ష్యాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది" అని ఐఎంఎఫ్ నివేదిక హెచ్చరించినట్లు పత్రిక వివరించింది. గత రెండు వారాల్లో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు గణనీయంగా పెరిగాయని, అయితే ఇప్పటివరకు మార్కెట్ స్పందన పెద్దగా లేదని, స్టాక్ మార్కెట్ ఇటీవలి లాభాలను నిలుపుకుందని, స్ప్రెడ్‌లు స్వల్పంగా పెరిగాయని నివేదిక పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రక్షణ బడ్జెట్‌ను రూ. 2.414 ట్రిలియన్లుగా ఐఎంఎఫ్ నివేదిక చూపించింది. ఇది ప్రస్తుత బడ్జెట్ కంటే రూ. 252 బిలియన్లు (12%) అధికం. అయితే, ఈ నెల ప్రారంభంలో భారత్‌తో ఘర్షణల నేపథ్యంలో, ఐఎంఎఫ్ అంచనాలతో పోలిస్తే ప్రభుత్వం రూ. 2.5 ట్రిలియన్లకు పైగా (18% అధికం) కేటాయించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ 11 కొత్త షరతులతో పాకిస్థాన్‌పై ఐఎంఎఫ్ విధించిన మొత్తం షరతుల సంఖ్య 50కి చేరిందని 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' నివేదించింది. "జూన్ 2025 చివరి నాటికి కార్యక్రమ లక్ష్యాలను చేరుకోవడానికి ఐఎంఎఫ్ సిబ్బంది ఒప్పందానికి అనుగుణంగా 2026 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కు పార్లమెంటరీ ఆమోదం" పొందాలనేది కొత్త షరతుల్లో ఒకటి. ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం, సమాఖ్య బడ్జెట్ మొత్తం రూ. 17.6 ట్రిలియన్లుగా ఉండనుండగా, ఇందులో అభివృద్ధి వ్యయం రూ. 1.07 ట్రిలియన్లుగా ఉంది. రాష్ట్రాలపై కూడా కొత్త షరతు విధించారు. దీని ప్రకారం నాలుగు సమాఖ్య యూనిట్లు (రాష్ట్రాలు) కొత్త వ్యవసాయ ఆదాయపు పన్ను చట్టాలను సమగ్ర ప్రణాళిక ద్వారా అమలు చేయాలి. ఇందులో రిటర్న్‌ల ప్రాసెసింగ్ కోసం కార్యాచరణ




వేదిక ఏర్పాటు, పన్ను చెల్లింపుదారుల గుర్తింపు, నమోదు, ప్రచార కార్యక్రమం, వర్తింపు మెరుగుదల ప్రణాళిక వంటివి ఉన్నాయి. దీనికి ఈ ఏడాది జూన్‌ను గడువుగా నిర్దేశించారు. మరో కొత్త షరతు ప్రకారం, ఐఎంఎఫ్ నిర్వహించిన గవర్నెన్స్ డయాగ్నస్టిక్ అసెస్‌మెంట్ సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం ఒక పరిపాలనా కార్యాచరణ ప్రణాళికను ప్రచురించాలి. కీలకమైన పరిపాలనా లోపాలను పరిష్కరించడానికి సంస్కరణ చర్యలను బహిరంగంగా గుర్తించడం ఈ నివేదిక ఉద్దేశం. 2027 తర్వాత ప్రభుత్వ ఆర్థిక రంగ వ్యూహాన్ని, 2028 నుంచి సంస్థాగత, నియంత్రణ వాతావరణాన్ని వివరిస్తూ ఒక ప్రణాళికను సిద్ధం చేసి ప్రచురించాలని కూడా ప్రభుత్వం ఆదేశించబడింది. ఇంధన రంగంలో నాలుగు కొత్త షరతులు ప్రవేశపెట్టారు. ఇంధన టారిఫ్‌లను వ్యయ రికవరీ స్థాయిలలో నిర్వహించడానికి ఈ ఏడాది జూలై 1 నాటికి వార్షిక విద్యుత్ టారిఫ్ రీబేసింగ్ నోటిఫికేషన్లను ప్రభుత్వం జారీ చేయాలి. అలాగే, ఫిబ్రవరి 15, 2026 నాటికి ఇంధన టారిఫ్‌లను వ్యయ రికవరీ స్థాయిలలో నిర్వహించడానికి అర్ధ-వార్షిక గ్యాస్ టారిఫ్ సర్దుబాటు నోటిఫికేషన్ జారీ చేయాలని నివేదిక తెలిపింది. ఈ నెలాఖరు నాటికి కెప్టివ్ పవర్ లెవీ ఆర్డినెన్స్‌ను శాశ్వతంగా చేయడానికి పార్లమెంట్ చట్టాన్ని ఆమోదించాలని ఐఎంఎఫ్ పేర్కొంది. పరిశ్రమలను జాతీయ విద్యుత్ గ్రిడ్‌కు మారేలా ఒత్తిడి తెచ్చేందుకు ప్రభుత్వం వాటిపై భారం పెంచింది. రుణ సేవా సర్చార్జ్‌పై యూనిట్‌కు గరిష్ఠంగా రూ. 3.21 పరిమితిని తొలగించడానికి కూడా పార్లమెంట్ చట్టాన్ని ఆమోదించాలి. ఇది విద్యుత్ రంగం అసమర్థతకు నిజాయితీగా బిల్లులు చెల్లించే వినియోగదారులను శిక్షించడమేనని తెలుస్తోంది. తప్పుడు ఇంధన విధానాలు, ప్రభుత్వ దుష్పరిపాలన వల్లే సర్క్యులర్ డెట్ పేరుకుపోతోందని ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ గతంలోనే స్పష్టం చేశాయి. ఈ పరిమితిని తొలగించడానికి జూన్ నెలాఖరు గడువుగా ఉంది. ప్రత్యేక సాంకేతిక జోన్లు, ఇతర పారిశ్రామిక పార్కులు, జోన్లకు సంబంధించిన అన్ని ప్రోత్సాహకాలను 2035 నాటికి పూర్తిగా దశలవారీగా రద్దు చేయడానికి నిర్వహించిన అంచనా ఆధారంగా పాకిస్థాన్ ఒక ప్రణాళికను సిద్ధం చేయాలని కూడా ఐఎంఎఫ్ షరతు విధించింది. ఈ నివేదికను ఈ ఏడాది చివరి నాటికి సిద్ధం చేయాలి. చివరగా, వినియోగదారులకు అనుకూలమైన షరతులో, వాణిజ్యపరంగా వాడిన మోటారు వాహనాల దిగుమతిపై అన్ని పరిమాణాత్మక ఆంక్షలను ఎత్తివేయడానికి (ప్రారంభంలో జూలై చివరి నాటికి ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న వాహనాలకు మాత్రమే) అవసరమైన అన్ని చట్టాలను పార్లమెంటుకు సమర్పించాలని ఐఎంఎఫ్ పాకిస్థాన్‌ను కోరింది. ప్రస్తుతం, మూడేళ్లలోపు కార్లను మాత్రమే దిగుమతి చేసుకోవడానికి అనుమతి ఉంది.

## ప్రతిపక్షాలు ఏకం కావాలి..

**చెన్నై:** ప్రతిపక్ష పార్టీలు ఏకం కావాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. గవర్నర్ అధికారాలపై కేంద్రం చర్యలను వ్యతిరేకించాలని ఆయన కోరారు. బీజేపీయేతర రాష్ట్రాల సీఎంలకు మే 17న లేఖలు రాశారు. బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతి, గవర్నర్‌కు సుప్రీంకోర్టు గడువు విధించడాన్ని ఎంకే స్టాలిన్ గుర్తుచేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మే 13న రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 కింద సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించడాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు కోర్టు నిర్ణయాన్ని లెక్కచేయకుండా గవర్నర్ అధికారాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా కోర్టును ఆశ్రయించడం వారి దుష్ట ఉద్దేశాన్ని సూచిస్తున్నదని ఆరోపించారు. కాగా, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలను వ్యతిరేకించాలని బీజేపీయేర రాష్ట్రాల ప్రభుత్వాలను డీఎంకే అధ్యక్షుడైన ఎంకే స్టాలిన్ కోరారు. 'మన సుప్రీంకోర్టు తన చారిత్రాత్మక తీర్పులో (తమిళనాడు రాష్ట్రం - తమిళనాడు గవర్నర్) సమర్థించిన విధంగా, రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని పరిరక్షించడానికి, సంరక్షించడానికి మనం కోర్టు ముందు సమన్వయంతో కూడిన చట్టపరమైన వ్యూహాన్ని రూపొందించాలి. ఐక్య ఫ్రంట్‌ను ప్రదర్శించాలి. ఈ కీలకమైన విషయంలో మీ తక్షణ, వ్యక్తిగత జోక్యం కోసం నేను ఎదురు చూస్తున్నా' అని ఆ లేఖలో పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌తో పాటు, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ, కేరళ, జార?ండ్, పంజాబ్, జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రులకు ఎంకే స్టాలిన్ లేఖలు రాశారు.

# వారికి నా కంటే అందగాడు కనిపించలేదేమో!




**హైదరాబాద్:** ఉగ్రవాదంపై భారత్ జరుపుతున్న పోరులో భాగంగా తన వంతు పాత్రను సమర్ధవంతంగా పోషిస్తున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ.. పాకిస్తాన్ ట్రోలర్స్ కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇస్లాంలో హింసకు తావులేదని పదే పదే చెబుతున్న అసదుద్దీన్‌పై పాకిస్తాన్‌కు చెందిన పలువురు ట్రోలింగ్‌కు దిగారు. దీనికి ఓవైసీ నవ్వుతూనే అదిరిపోయే కౌంటర్ ఇచ్చారు. 'పాకిస్తాన్‌లో ఉన్న వారికి భారత్‌లో ఉన్న నేను మాత్రమే కనిపిస్తున్నాను. నా కంటే అందగాడు వారికి కనిపించలేదేమో. అందుకే నా ప్రసంగాలు వింటూ ఉన్నారు. నా ప్రసంగాలు విని మీ మెదడులో ఉన్న చెత్తను తీసేయండి. అది అందరికీ మంచిది. మీ అజ్ఞానం కూడా అంతమవుతుంది' అని అసదుద్దీన్ తెలిపారు. "మీపై పాకిస్తాన్ ట్రోలింగ్ ఎక్కువైంది కదా" ? అని మీడియా అడిగిన ప్రశ్నకు ఓవైసీ నవ్వుతూ స్పందించారు. వారికి తన కంటే అందగాడు భారత్ లో కనిపించలేదేమో. అందుకే నా ప్రసంగాలను ట్రోల్స్ చేస్తున్నారు' అంటూ చమత్కరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం చోటు చేసుకున్న పరిణామాల్లో భాగంగా అంతర్జాతీయ వేదికపై ఉగ్రవాదంపై భారత్ సాగిస్తున్న పోరాటానికి ఓవైసీ సిద్ధమవుతున్నారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత, ఆపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కు ముందు జరిగిన అఖిలపక్ష సమావేశానికి ఓవైసీకి ఆహ్వానం చివరి నిమిషంలో అందింది. తొలుత ఓవైసీకి ఆహ్వానం అందలేదనే వార్తల నేపథ్యంలో హెూంమంత్రి అమిత్ షా స్వయంగా ఫోన్ చేసి ఓవైసీని అఖిలపక్ష సమావేశానికి రమ్మని ఆహ్వానించారు. అప్పట్నుంచీ పాకిస్తాన్ దుశ్చర్యలను ఎండగడుతూనే ఉన్నారు అసదుద్దీన్ ఓవైసీ. పాకిస్తాన్ ఓ ఉగ్రవాద దేశంగా మారిపోయిందని, ఆ దేశం అర్థ శతాబ్దం వెనక్కి పోయిందంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఇలా సమయం వచ్చినప్పుడల్లా పాకిస్తాన్ తీరుపై ధ్వజమెత్తుతూనే ఉన్నారు ఓవైసీ.

# ప్లాన్డ్.. ట్రెయిన్డ్.. ఎగ్జిక్యూటెడ్

పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పేందుకే 'ఆపరేషన్ సిందూర్' చేపట్టామని భారత సైన్యం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన ఓ కొత్త వీడియోను ఆదివారం సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో విడుదల చేసింది. 'పక్కా ప్రణాళికతో, తగిన శిక్షణతో దీనిని అమలు చేశాం. న్యాయం జరిగింది' అని భారత సైన్యానికి చెందిన పశ్చిమ కమాండ్ ఈ వీడియోలో పేర్కొంది. భారత సైన్యం పశ్చిమ కమాండ్ విడుదల చేసిన ఈ వీడియోలో ఒక సైనికాధికారి మాట్లాడుతూ 'ఆపరేషన్ సిందూర్' అనేది పాకిస్థాన్‌కు ఒక గుణపాఠం. దశాబ్దాలుగా వారు నేర్చుకోని పాఠం ఇది' అని వ్యాఖ్యానించారు. 'పహల్గామ్ ఉగ్రదాడితో ఇదంతా మొదలైంది. ఆ ఘటనతో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈసారి వారి తరతరాలు గుర్తుంచుకునేలా గుణపాఠం చెప్పాలన్నదే మా ఏకైక ఆలోచన. ఇది ప్రతీకారం కాదు, న్యాయం మాత్రమే. మే 9వ తేదీ రాత్రి సుమారు 9 గంటల సమయంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన ప్రతీ శత్రు సైనిక స్థావరాన్ని భారత సైన్యం ధ్వంసం చేసింది. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక చర్య మాత్రమే కాదు, పాకిస్థాన్‌కు దశాబ్దాలుగా అర్థం కాని రీతిలో చెప్పిన గుణపాఠం' అని సైనిక సిబ్బంది ఆ వీడియోలో వివరించారు. గత నెలలో జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనకు ప్రతిస్పందనగా, మే 7న భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. ఇందులో భాగంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద సంబంధిత స్థావరాలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేసింది. తాజాగా విడుదల చేసిన వీడియో ద్వారా తమ చర్య ఎంత కఠినంగా ఉంటుందో పాకిస్థాన్‌కు మరోసారి స్పష్టం చేసినట్టయింది.



## ఐఎస్ఐ ఆహ్వానంపై పాక్ వెళ్లిన కాంగ్రెస్ ఎంపీ సీఎం సంచలన వ్యాఖ్యలు



**గౌహతి:** పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదంపై భారత వైఖరిని ప్రపంచదేశాల ముందుకు తీసుకువెళ్లేందుకు ఎంపీల ప్రతినిధుల బృందాలను విదేశాలకు పంపాలని కేంద్రం ఇటీవల నిర్ణయం తీసుకుంది. వివిధ పార్టీలకు చెందిన ఎంపీలతో ఏడు ప్రతినిధి బృందాలను ప్రకటించింది. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదిత నలుగురు ఎంపీల్లో ఒకరైన గౌరవ్ గొగోయ్ విషయంలో ఆసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తాజాగా ఆయనపై మరింత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాక్ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఆహ్వానం మేరకు గొగోయ్ పాక్ వెళ్లారని ఆరోపించారు. అక్కడ శిక్షణ పొందేందుకే ఆయన వెళ్లారని కూడా చెప్పారు. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా తమ వద్ద ఉన్నట్టు చెప్పారు. "పాకిస్తాన్ హెూం శాఖ నుంచి లేఖ రావడంతో గౌరవ్ గొగోయ్ ఆ దేశానికి వెళ్లారు. పాక్ ప్రభుత్వం ఆహ్వానం మేరకే ఆయన వెళ్లారు. విదేశాంగ శాఖ, సాంస్కృతిక శాఖ ఆహ్వానంతో కాదు. ఇది చాలా సీరియస్ అంశం. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలి" అని హిమంత బిస్వ శర్మ అన్నారు.

### అసోం సీఎం ఏమన్నారు?

దీనికి ముందు, విదేశాలకు వెళ్లే భారత ప్రతినిధి బృందంలో ఈశాన్య ప్రాంతాల ఎంపీలను ఎంపిక చేయడంపై హిమంత బిస్వ శర్మ హర్షం వ్యక్తం చేశారు. ఈశాన్య ప్రాంతాల నుంచి ముగ్గురు ఎంపీలను ఎంపిక చేయడం చాలా సంతోషమని, నాగాలాండ్ నుంచి ఒకరిని, అసోం నుంచి ఇద్దరిని ఎంపిక చేశారని చెప్పారు. విదేశాలకు పంపే ప్రతినిధి బృందం కోసం కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన జాబితాలోని గౌరవ్ గొగోయ్ పేరును తొలగించాలని రాహుల్ గాంధీని కోరారు. కాంగ్రెస్ ఎంపిక చేసిన నేతల జాబితాను ఆ పార్టీ నేత జైరామ్ రమేష్ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. దీనిపై శర్మ స్పందిస్తూ, జాతీయ భద్రతా ప్రయోజనాల దృష్ట్యా అసోం ఎంపీ పేరును తొలగించాలని నేరుగా గొగోయ్ పేరును ప్రస్తావించకుండా అన్నారు. "జాబితాలో పేర్కొన్న ఎంపీల్లో ఒకరు (అసోం నుండి) పాకిస్తాన్‌లో ఎక్కువ కాలం ఉన్న విషయాన్ని ఖండించలేదు. రెండు వారాల పాటు ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన భార్య భారతదేశంలో పనిచేస్తున్నప్పుడు పాకిస్తాన్‌కు చెందిన ఒక ఎన్జీవో నుంచి జీతం పొందుతున్నట్టు విశ్వసనీయ పత్రాలు చూపిస్తున్నాయి" అని శర్మ ఒక ట్వీట్‌లో తెలిపారు.

## లష్కరే టాప్ టెర్రరిస్ట్ సైఫుల్లా ఖలీద్ హతం



లష్కరే టాప్ టెర్రరిస్ట్ సైఫుల్లా ఖలీద్ హతమయ్యాడు పాకిస్థాన్‌లో ఖలీద్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. తన నివాసం నుంచి ఆదివారం మధ్యాహ్నం బయటకు వెళ్లిన ఖలీద్‌ను దాడి చేసి హతమార్చారు. లష్కరే కమాండర్లతో కలిసి ఖలీద్ పనిచేశాడు. 2006లో నాగపూర్ ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో ఖలీద్ సూత్రధారి. నాగపూర్, రాంపూర్, బెంగుళూరు దాడుల్లో ఖలీద్ హస్తం ఉంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఖలీద్‌కు పాకిస్థాన్ సర్కార్ భద్రత కల్పించింది. నేపాల్‌లో ఉంటూ లష్కరే కార్యకలాపాలు నిర్వహించిన ఖలీద్.. ఇటీవల సింధ్ ప్రావిన్స్‌లోని బాదిక్ జిల్లాకు మకాం మార్చాడు. ఇవాళ అక్కడే హతమయ్యాడు. 2001లో రాంపుర్‌లోని సీఆర్పీఎఫ్ శిబిరంపై, 2005లో బెంగళూరులోని ఐఐఎస్‌సీపై జరిగిన దాడుల్లోనూ ఖలీద్ హస్తం ఉంది.

## బహిష్కరణ, తిరిగి పార్టీలోకి..



**న్యూఢిల్లీ:** బహుజన్ సమాజ్ పార్టీ చీఫ్ మాయావతి మరోసారి తన మేనల్లుడికి పార్టీ కీలక బాధ్యతలు అప్పగించారు. పార్టీ చీఫ్ నేషనల్ కోఆర్డినేటర్‌గా ఆయనను నియమించారు. ఢిల్లీ లోధిరోడ్‌లోని సెంట్రల్ ఆఫీస్‌లో బీఎస్పీ జాతీయస్థాయి సమావేశం ఆదివారం నాడు జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ నేతలు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్ని జిల్లాల అధ్యక్షులు, కోఆర్డినేటర్లతోపాటు జాతీయ కోఆర్డినేటర్లు, జనరల్ సెక్రటరీలు, రాష్ట్రాల అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆకాష్ ఆనంద్‌కు పార్టీ చీఫ్ నేషనల్ కోఆర్డినేటర్‌గా మాయావతి బాధ్యతలు అప్పగించారు. ఈసారి పార్టీని, పార్టీ ఉద్యమాన్ని అత్యంత జాగరూకతతో, నిబద్ధతతో ఆయన ముందుకు తీసుకువెళ్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

బహిష్కరణ, తిరిగి పార్టీలోకి..

ఆకాష్ ఆనంద్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు గత మార్చి 3న మాయావతి ప్రకటించారు. ఆకాష్ తన మామగారైన అశోక్ సిద్ధార్థ్ ప్రభావానికి లోనుకావడంతో మాయావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా బహిష్కరణ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. పార్టీ నేషనల్ కోఆర్డినేటర్‌గా పనిచేసిన ఆకాష్‌ను అంతకు ముందు తన రాజకీయ వారసుడిగానూ మాయావతి ప్రకటించారు. పార్టీ నుంచి బహిష్కరించిన 40 రోజుల తర్వాత తిరిగి ఏప్రిల్ 13న ఆయనను పార్టీలోకి మాయవతి తీసుకున్నారు. గతంలో చేసిన పొరపాట్లకు ఆకాష్ విచారం వ్యక్తం చేయడంతో మాయవతి ఈ నిర్ణయం తీసుకున్నారు.

# గుల్జార్‌హౌస్ సమీప భవనంలో భారీ అగ్నిప్రమాదం

-మొదటిపేజీ తరువాయి

డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, పోలీసు సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఉన్న మరికొందరిని బయటకు తీసుకొచ్చారు. 10 అగ్నిమాపక యంత్రాలతో సహాయక చర్యలు చేపట్టారు. గుల్జార్ హౌస్ పరిసరాల్లో దట్టంగా పొగ కమ్ముకోవడంతో శ్వాస తీసుకునేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

**మృతుల్లో 8 మంది చిన్నారులే..**

ప్రహ్లాద్ (70), మున్నీ (70) రాజేందర్ మోదీ (65) సుమిత్ర (60) హమేయ్(7) అభిషేక్ (31) శీతల్ (35) ప్రియాంశ్ (4) ఇరాజ్ (2) ఆరుషి (3) రిషభ్ (4) ప్రథమ్ (ఏడాదిన్నర) అనుయాన్ (3) వర్ష (35) పంకజ్ (36) రజినీ (32) ఇద్దు (4)

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి..**

అగ్ని ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో 17 మంది మృతి చెందడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. బాధిత కుటుంబసభ్యులతో రేవంత్ ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు. మరోవైపు ఘటనా స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి తదితరులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

**అగ్నిమాపక సిబ్బందికి సరైన శిక్షణ అందించాలి: కిషన్‌రెడ్డి**

అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రమాదం జరిగిందని చెప్పారు. సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది ఆలస్యం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారని తెలిపారు. చిన్న ప్రమాదమే అయినా.. ప్రాణ నష్టం ఎక్కువగా ఉందన్నారు. అగ్నిమాపక సిబ్బందికి ప్రభుత్వం సరైన పరికరాలు, శిక్షణ అందించాల్సి ఉందని చెప్పారు. అగ్నిమాపక శాఖ సాంకేతికతను మెరుగుపరుచుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు కేంద్రం తరఫున సాయం అందిస్తామని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.



**పాతబస్తీలో ఘోర అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి**

పాతబస్తీలోని చార్మినార్ సమీపంలోగల గుల్జార్ హౌస్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఏకంగా 17 మంది మృత్యువాత పడడం విచారకరమని పేర్కొన్నారు. ఆ మరణాలపట్ల తీవ్ర సంతాపం ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబాలకు తగిన ఆర్థికసాయం ప్రకటించి అండగా నిలవాలని ప్రభుత్వానికి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నిత్యం అప్రమత్తంగా ఉంటూ తగు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**విద్యుదాఘాతం వల్లే గుల్జార్‌హౌస్‌లో అగ్నిప్రమాదం జరిగిందన్న నాగిరెడ్డి**

ఆదివారం ఉదయం చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌస్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంపై అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి మీడియాతో మాట్లాడారు. విద్యుదాఘాతం వల్లే గుల్జార్‌హౌస్‌లో అగ్నిప్రమాదం జరిగిందని వెల్లడించారు. ఇంట్లో చెక్కతో చేసిన ప్యానెళ్ల వల్లే మంటలు వ్యాపించాయని తెలిపారు. విద్యుదాఘాతంతో చెక్క మొత్తం కాలి మంటలు వచ్చాయని చెప్పారు. భవనం మొదటి అంతస్తులో ఉన్న 17 మందిని రక్షించి ఆసుపత్రికి తరలించామని అన్నారు. నిచ్చెన ద్వారా నలుగురు పైనుంచి కిందికి వచ్చారని, భవనంలో అగ్నిప్రమాద నివారణకు సంబంధించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలేదన్నారు. బిల్డింగ్ విద్యుత్ సరఫరాకు సంబంధించిన మెయిన్ వద్ద నిత్యం విద్యుదాఘాతం జరుగుతున్నట్లు కార్మికులు చెబుతున్నారని నాగిరెడ్డి తెలిపారు.

**గుల్జార్ హౌస్ ప్రమాద ఘటన కలచివేసింది: మోదీ**

చార్మినార్ పరిధి గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదంలో పలువురి మృతి కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటిం చారు. క్షతగాత్రులకు రూ.50 వేల పరిహారం అందిస్తామన్నారు. గుల్జార్‌హౌస్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులున్నారు. ఆదివారం ఉదయం భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి ఉస్మానియా, యశోద (మలక్‌పేట), డీఆర్డీవో అపోలో ఆసుపత్రులకు తరలించారు. విద్యుదాఘాతం వల్లే భవనంలో మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం.

**ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# నేటి నుంచే భూముల రీసర్వే!

-మొదటిపేజీ తరువాయి

గండీడ్ మండలం సలార్‌నగర్, జగిత్యాల జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్త), ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ గ్రామాల్లోనే సర్వే నిర్వహించాలనుకున్నా ఆ తర్వాత సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం సాహెబ్‌నగర్, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగూరు గ్రామాలను కూడా కలిపారు. ఈ ఐదు గ్రామాల్లో పైలట్ సర్వే నిర్వహించేందుకు మూడు ఏజెన్సీలను ఎంపిక చేశారు. భూముల రీసర్వేను సర్వే, సెటిల్‌మెంట్ శాఖ పర్యవేక్షించనుంది.

**గ్రామ పటాలు, కమతాల పటాల తయారీ..**

భూముల రీసర్వేకు ప్రస్తుతం ఎంపిక చేసిన ఐదు గ్రామాల పటాలతోపాటు ప్రతి కమతానికి సరిహద్దులు నిర్ధారించి ఆయా కమతాల పటాలు కూడా రూపొందించనున్నారు. ఇందుకోసం ఆ గ్రామంలో ఎంత భూమి ఉంది.. ఎన్ని సర్వే నంబర్లున్నాయనే వివరాల ఆధారంగా సర్వేయర్లను మోహరించి ప్రతి సర్వే, బైసర్వే నంబర్లలోని కమతాలకు విడివిడిగా పటాలను తయారు చేయనున్నారు. ఇప్పటికే గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఛెస్సలా, ఖాస్రా పహాణీ రికార్డులతో వాటిని సరిపోల్చి వివాదాల్లేని కొత్త పటాలను రెవెన్యూ రికార్డుల్లో చేర్చనున్నారు. ఈ గ్రామాల్లో ఎదురయ్యే అనుభవాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా భూముల రీసర్వే మార్గదర్శకాలు తయారవుతాయని సర్వే శాఖ అధికారులు చెబుతున్నారు.

**ఆ గ్రామానికి నక్ష లేదు!**

భూముల రీసర్వే కోసం ప్రభుత్వం ఎంపిక చేసిన ఐదు గ్రామాల్లోని రెండు గ్రామాల స్థితిగతులపై 'సాక్షి'క్షేత్రస్థాయి సమాచారం సేకరించింది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్‌నగర్ గ్రామాల్లో పరిస్థితుల గురించి స్థానిక రెవెన్యూ యంత్రాంగాన్ని అడిగి తెలుసుకుంది. ములుగుమడ గ్రామం తొలుత బ్రిటిష్ పాలన అమలైన నాటి ఆంధ్ర ప్రాంతంలో ఉండేది. అలాగే నిజాం పాలించిన తెలంగాణ ప్రాంతంలో ప్రస్తుత కంచికర్ల మండలంలో ఉన్న పరిటాల అనే గ్రామం ఉండేది. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు జిల్లాల సరిహద్దుల మార్పుల్లో భాగంగా పరిటాలను గుంటూరు జిల్లాలో చేర్చి ములుగుమడను ఖమ్మం జిల్లాలో చేర్చారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భంచాక కూడా ములుగుమడ తెలంగాణకే వచ్చింది. అయితే, భూరికార్డుల ప్రక్షాళన జరిగే వరకు ఆ గ్రామంలో భూముల రికార్డులు సెంట్ల రూపంలోనే ఉండేవి. గుంటలు, ఎకరాలుగా ఉండేవి కావు. భూరికార్డుల ప్రక్షాళన తర్వాత దాన్ని గుంటల్లోకి మార్చారు. కానీ ఆ గ్రామ నక్షను అప్పటి నుంచి ఇప్పటిదాకా తయారు చేయలేదు. దీంతో ములుగుమడ గ్రామానికి అధికారికంగా గ్రామ సరిహద్దులే లేకుండా పోయాయి. ఇప్పుడు ఈ గ్రామాన్ని పైలట్ సర్వే కింద ప్రభుత్వం ఎంపిక చేసింది. మొదటగా స్థానిక రెవెన్యూ యంత్రాంగం గ్రామ సరిహద్దులను నిర్ధారించింది. ఈ మేరకు గ్రామ నక్షను కూడా తయారు చేయనున్నాయి. ఈ గ్రామంలో మొత్తం 103 సర్వే నంబర్లకు 845 ఎకరాల వరకు భూమి ఉంది. ఈ భూమిలోని ప్రతి కమతాన్ని సర్వే, బైసర్వే నంబర్లవారీగా రీసర్వే నిర్వహించి ఆయా కమతాల హద్దులు నిర్ధారించి పటాలు తయారు చేయనున్నారు. ఇక మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్‌నగర్ అనే గ్రామానిక నక్షతోపాటు ఇతర రెవెన్యూ రికార్డులన్నీ ఉన్నాయి. ఈ గ్రామంలోనూ ఇతర గ్రామాలతో సరిహద్దులను గుర్తించారు. ఈ గ్రామంలో 122 సర్వే నంబర్లలో 422 ఎకరాల భూమి ఉంది. సోమవారం నుంచి ఈ భూమిని కమతాల వారీగా సర్వే నిర్వహించి హద్దుల నిర్ధారణ ద్వారా కమతాలవారీగా పటాలు రూపొందించనున్నారు.

**ఏమవుతుందో... ఏమో?**

భూముల రీసర్వే విషయంలో రెవెన్యూ వర్గాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. తెలంగాణలో నెలకొన్న భౌగోళిక పరిస్థితులు, రెవెన్యూ రికార్డులను బట్టి సర్వే జరిపితే ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో సమస్యలు వస్తాయని అంటున్నారు. ఈ విషయమై ఓ తహసీల్దార్ 'సాక్షి'తో మాట్లాడుతూ 'ఓ గ్రామంలోని 311 సర్వే నంబర్‌లో 200 ఎకరాలకు రికార్డు ఉంది. కానీ ఆ సర్వే నంబర్‌లో 300 ఎకరాల భూమి ఉంది. ఆ మేరకు రైతులకు 300 ఎకరాలకు పాసుపుస్తకాలున్నాయి. కానీ, రెవెన్యూ రికార్డును మార్చలేకపోతున్నాం'అని అన్నారు. మరోవైపు భూకబ్జా ఓ సర్వే నంబర్‌లో ఉంటే రికార్డు మరో సర్వే నంబర్‌లో ఉంటుందని.. రాష్ట్రంలోని మొత్తం భూముల్లో 35%-%40 శాతం భూములకు ఇదే సమస్య వస్తుందన్నారు. రీసర్వేలో ఇదే విషయం తేలితే ఆయా గ్రామాల్లోని రికార్డులు, రైతుల పాసుపుస్తకాలన్నింటినీ మార్చాల్సి వస్తుందని చెప్పారు. రీసర్వే సులభమైనప్పటికీ అనంతరం ఎదురయ్యే సమస్యల పరిష్కారమే పెద్ద సవాల్ అని అభిప్రాయపడ్డారు.

# బీర్లను, బార్లను నమ్ముకొని పాలన కొనసాగిస్తారా?

**హైదరాబాద్ :** బీర్లను, బార్లను నమ్ముకొని పాలన కొనసాగిస్తారా? మద్యం అమ్మకాలు పెంచి ఖజానా నింపుకుంటారా? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఎక్సైజ్ ఆదాయంలో తెలంగాణ రైసింగ్.. ఇదేనా మీరు చెప్పిన మార్పు రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు నిలదీశారు. పాలన గాలికి వదిలి, సంక్షేమ పథకాలను అటకెక్కించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువగా ఎక్సర్ సైజ్ చేస్తున్న డిపార్ట్‌మెంట్ ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ ఒక్కటే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మద్యంపై రాద్ధాంతం చేసిన వాళ్లే, మద్యం ధరలు పెంచి వేల కోట్ల రాబడిని సమకూర్చుకోవాలనుకోవడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఇప్పటికే బీర్ల ధరలను 15 శాతం పెంచిన ప్రభుత్వం, ఇప్పుడు లిక్కర్ ధరలు పెంచి, పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నది. ఒకవైపు మద్యం ధరలు పెంచడం, మరోవైపు విక్రయాలను రెండింతలు చేయాలని అధికారులను ఆదేశించడంలోనే ప్రభుత్వం అంతర్యం స్పష్టమవుతున్నది. ఎన్నికల ముందు సుద్ద పూస మాటలు, అధికారంలోకి రాగానే అడ్డగోలుగా మద్యం ధరల పెంపు అని హరీశ్‌రావు విరుచుకుపడ్డారు. దివాలా దివాలా అని దిక్కుమాలిన ప్రచారం చేసి రాష్ట్ర పరపతిని దిగజార్చారు. అనాలోచిత నిర్ణయాలు, దుందుడుకు చర్యల వల్ల రాష్ట్ర ఆర్థిక ప్రగతి రోజు రోజుకి క్షీణిస్తుండగా, ఆ లోటును భర్తీ చేసుకునేందుకు మద్యం ధరలు పెంచడం మీకే చెల్లింది అని ధ్వజమెత్తారు. మద్యం నియంత్రణ విషయంలో మేనిఫెస్టో లో చెప్పిన ఒక్క హామీ అయినా ఇప్పటి వరకు అమలు చేశారా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎక్సైజ్ విధానాన్ని పరిశీలించి, సవరణలు చేయడం అంటే ధరలు అడ్డగోలుగా పెంచడమేనా ముఖ్యమంత్రి గారూ.. ఇష్టారీతిన మద్యం ధరలు పెంచి, తాగుబోతుల ద్వారా ఖజానా నిలుపుకోవాలని చూస్తారా? రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణ చేసి, మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో తెలంగాణను నెంబర్ 1 చేస్తారా? మీరు చెబుతున్న తెలంగాణ రైజింగ్ అంటే ఇదేనా? అని నిలదీశారు. బెల్ట్ షాపులు మూస్తామని హామీ ఇచ్చి, గల్లి గల్లీలో బెల్ట్ షాపు తెరిచి తాగుబోతుల తెలంగాణగా మార్చే కుట్ర కాంగ్రెస్ చేస్తున్నది. ఒకవైపు ఎక్సైజ్ ద్వారా ప్రజల నుంచి డబ్బును ముక్కు పిండి వసూలు చేస్తూ, మరోవైపు ప్రజలకు అందించే సంక్షేమ పథకాలకు బడ్జెట్ లో సరైన కేటాయింపులు చేయలేదు. ఇచ్చేది ఎగబెడుతున్నరు. ఉల్టా ప్రజల నుంచి డబ్బులు లాక్కుంటున్నరు. ఇదేనా మీరు చెప్పిన మార్పు అంటే? ఇంకెన్ని సార్లు మద్యం ధరలు పెంచుతారు? ఇంకెన్ని కోట్లు ప్రజల నుండి దండుకుంటారు? ఇది చాలదన్నట్లు సర్కారు గల్లా పెట్టె ఫుల్లుగా నింపుకోవాటానికి గ్రామీణ జిల్లాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 30 కిలో మీటర్లకు ఒకటి చొప్పున 100కు పైగా మైక్రో బ్రూవరీల ఏర్పాటు చేస్తున్నరట. ఇంతకంటే దిగజారుడు, దిక్కుమాలిన పాలన ఎక్కడైనా ఉంటుందా? రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణ చేసి, భార్యా పిల్లలను రోడ్ల మీద పడేస్తారా? యువత బతుకులను ఆగం చేస్తారా? అసలు ఈ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏం చేయాలనుకుంటున్నది? అని హరీశ్‌రావు నిలదీశారు.



## సంగారెడ్డిలో ఉగ్రమూలాల కలకలం..

-మొదటిపేజీ తరువాయి

బయడపడినట్లు తెలుస్తోంది. అస్సాం పోలీసుల ఆపరేషన్ ఘోస్ట్ సిమ్‌లో భాగంగా ఇస్లాం బాగోతం వెలుగులోకి వచ్చింది. అస్సాంలో గుర్తింపు కార్డులు లేకుండా సిమ్ కార్డులు తీసుకుని సంగారెడ్డి జిల్లాలో పలువురికి విక్రయిస్తున్నట్లు తెలిసింది. గతంలో అస్సాంలో మొబైల్ షాపులో పని చేసిన ఇస్లాం.. అక్కడే కొందరి గుర్తింపు కార్డులతో నకిలీ సిమ్ లు తీసుకుని అధిక ధరకు విక్రయించాడు. ప్రస్తుతం గొల్లపల్లిలో తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అదే సమయంలో తన వద్ద ఉన్న నకిలీ సిమ్ కార్డులను పాకిస్తానీయులకు అమ్మినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. భారత్ ఫోన్ నెంబర్లతో పాకిస్తాన్ లో వాట్సాప్ అకౌంట్ లు క్రియేట్ కావడంతో ఈ కోణంలో దర్యాప్తు సాగిస్తున్నారు పోలీసులు. ఇటీవల జరిగిన భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధంలో భాగంగా మీడియాలో వచ్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నట్లు సమాచారం.

**దేశ వ్యాప్తంగా ఏడుగురు అరెస్ట్.. అంతా అస్సాం వారే**

ఆపరేషన్ ఘోస్ట్ సిమ్ లో భాగంగా దేశ వ్యాప్తంగా ఏడుగుర్ని పోలీసులు అదుపులోకి తీసుకోగా, అంతా అస్సాం రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. ఈ ఏడుగురు అనుమానితులు వివిధ రాష్ట్రాల్లో ఉంటూ దేశ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పాకిస్తాన్ లోని తమ మిత్రులకు సమాచారం చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి సంగారెడ్డిలో మకాం వేసిన అస్సాం పోలీసులు తమ దర్యాప్తును అత్యంత గోప్యంగా సాగిస్తున్నట్లు సమాచారం.

## గుల్జార్‌హౌస్ ఘటన..
## పరిహారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం



**హైదరాబాద్:** చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి 17 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతులకు ఒక్కొక్కరికి రూ. 5లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహాతో కలిసి ఆయన ఘటనాస్థలిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. "ఈ ఘటనపై అన్ని శాఖల అధికారులతో చర్చిస్తూ, ఎప్పటికప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ ద్వారా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు చెబుతున్నారు. ఉదయం 6.16 గంటలకు అగ్నిమాపక సిబ్బందికి ప్రమాదం గురించి సమాచారం అందింది. వెంటనే 6.17కి మొగల్‌పుర ఫైర్ ఇంజిన్ సిబ్బంది బయలుదేరి 6.20గంటలకు ప్రమాదస్థలికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. ఈక్రమంలో మొత్తం 11 ఫైర్ ఇంజిన్లతోపాటు ఒక రోబోను ఉపయోగించారు. 70 మంది ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. దీంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా నియంత్రించగలిగారు. ఈ ఘటన జరగడం అత్యంత దురదృష్టకరం. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది" అని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు.

## మందుబాబులకు షాక్

-మొదటిపేజీ తరువాయి

మార్పులుండవని పేర్కొంది. మద్యం ధరల పెంపుపై మందుబాబులో మండిపడుతున్నారు. అయితే, ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం మద్యం ధరలను సవరించినట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా.. వేసవికి ముందు ఫిబ్రవరిలో బీర్ల ధరలు ఒకేసారి 15శాతం పెంచారు. రిటైర్డ్ జడ్జి జైస్వాల్ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ నివేదిక మేరకు ఎక్సైజ్‌శాఖ ధరల పెంపు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఆ తర్వాత ప్రభుత్వం బీర్ల ధరలను సవరించింది. ఇదిలా ఉండగా.. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది బీర్ల అమ్మకాలు భారీగా పెరిగాయని ఎక్సైజ్‌శాఖ పేర్కొంది. గత నెలలో మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి రూ.3,272.32 కోట్ల వరకు ఆదాయం వచ్చింది.

## సచివాలయంలో ప్రపంచ
## సుందరీమణుల సందడి



**హైదరాబాద్:** మిస్ వరల్డ్ పోటీల నిమిత్తం హైదరాబాద్‌కు విచ్చేసిన ప్రపంచ దేశాల అందాల భామలు.. ఇవాళ తెలంగాణ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయం బ్యాక్ డ్రాప్‌లో గ్రూప్ ఫోటో దిగిన సుందరీమణులు.. తెలంగాణ తల్లి విగ్రహానికి నమస్కరించారు. అత్యంత విశాలంగా.. అద్భుతమైన సెక్రటేరియట్‌ను చూసి ఆశ్చర్య వ్యక్తం చేసిన కంటెస్టెంట్లు.. సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. తెలంగాణ తల్లి ముందు ర్యాంప్ వాక్ చేశారు. సెక్రటేరియట్ మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు ఏర్పాట్లు చేసిన హైటీలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అభివృద్ధి, సెక్రటేరియట్ నిర్మాణం, పథకాలను ఉద్దేశించి సీఎస్ ప్రసంగించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ పోటీలు అంటే కేవలం క్రీడ కాదన్నారు. మిస్ వరల్డ్ పోటీల వల్ల తెలంగాణ టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను గత నాలుగు రోజులుగా ప్రపంచ అందగత్తెలు తిలకించారు. మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణకు తెచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు. మిస్ వరల్డ్ పోటీలతో తెలంగాణలో యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని జూపల్లి కృష్ణారావు అన్నారు. కాగా, కంటెస్టెంట్లు ప్రయాణించే రహదారులన్నీ రంగురంగుల విద్యుద్దీపాలతో అలకరించారు. స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్%-%12లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా అందాల భామలు సందర్శించారు. ఎన్టీఆర్ మార్గ్‌లో, బడా గణేష్ నిమజ్జనం జరిగే చోట తెలంగాణ చరిత్రకు అద్దంపట్టే సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా ఎన్టీఆర్ మార్గ్‌లో రాష్ట్ర పక్షి పాలపిట్ట, రాష్ట్ర జంతువు కృష్ణజింకతో ఏర్పాటు చేసిన ఆర్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# సంపాదకీయం

## దృఢనిశ్చయం

ప్రధాని నరేంద్ర మోదీ ఎలాంటి శషభిషలూ లేకుండా కుండబద్దలు కొట్టారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ వాణిజ్యం అంటే కుదరదని, ఉగ్రవాదానికి ఊతమిస్తూ నీళ్లు కావాలంటే చెల్లదని, ఉగ్రవాదానికి అండదండలందిస్తూ చర్చలంటే అంగీకరించబోమని, అణు బెదిరింపులు తమను భయపెట్టలేవని మోదీ పంపిన సందేశంతోనైనా పాకిస్తాన్ ఇకపై బుద్ధెరిగి ప్రవర్తించాలి. జాతినుద్దేశించి సోమవారం ఆయన చేసిన ప్రసంగం ఆద్యంతమూ కశ్మీర్ విషయంలో పాక్ తీరుతెన్నులపై భారత్ వైఖరిలో వచ్చిన మార్పునకు అద్దం పట్టింది. ఒక కొత్త క్రమం బయల్దేరిందన్న సంకేతాన్నిచ్చింది. ఇకపై ఉగ్రవాదులనూ, వారికి సాయం చేసే ప్రభుత్వాన్నీ వేర్వేరుగా పరిగణించబోమని ఆయన ప్రకటించటం ఒక్క పాకిస్తాన్ మాత్రమే కాదు...ప్రపంచ దేశాలన్నీ గమనించాల్సిన అత్యంత కీలక అంశం. కాల్పుల విరమణ తాత్కాలిక దశేనని, ఉగ్రవాదం శిరసెత్తినప్పుడల్లా 'ఆపరే షన్ సిందూర్' కొనసాగుతూనే వుంటుందని మోదీ చెప్పటం గమనార్హం. ఉగ్రవాదం విషయంలో అమెరికా నిర్లిప్తంగా ఉంటున్నది. 2001లో తమ దేశంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు 'ఉగ్ర వాదంపై యుద్ధం' పేరిట ప్రపంచంలో ఎక్కడున్నా ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని ప్రకటించిన అమెరికా... కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్‌ను ఎప్పటికప్పుడు వెనకేసు కొస్తోంది. మొన్నటికి మొన్న పాక్‌కు ఐఎంఎఫ్ అప్పు పుట్టడంలో యథోచితంగా సహకరించింది. దాని చీకటి వ్యవహారాలు తెలియనట్టే ప్రవర్తిస్తూ ఎప్పటికప్పుడు నిధులూ, ఆయుధాలూ ఉదారంగా అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతుందని మోదీ ప్రకటించాల్సి వచ్చింది. దారుణ ఉదంతాలు జరిగినప్పుడల్లా ఏదో కారణం చూపి పాకిస్తాన్‌ను గట్టెక్కి స్తున్న దేశాలు ఇకముందు దీన్ని గమనించుకోక తప్పదు. ఎంతటి క్లిష్టసమయాల్లోనైనా పట్టువిడుపులు ప్రదర్శించటంలోనే పరిణతి వ్యక్తమవుతుంది. 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్తాన్‌లోని ఉగ్రమూకల స్థావరాలను ధ్వంసం చేయటంలోనూ, అక్కడి సైన్యం ప్రతిఘటనను తిప్పికొట్టడంలోనూ తెగువనూ, సాహసాన్నీ చూపిన భారత్... లక్ష్యసాధన పూర్తికాగానే కాల్పుల విరమణకు కూడా సిద్ధపడి తన పరిణతిని తెలియజెప్పింది. కానీ విఫల రాజ్యం అనే పేరును సార్థకం చేసుకుంటూ కాల్పుల విరమణకు ఒప్పుకున్నట్టే ఒప్పుకుని ఆ వెంటనే ఉల్లంఘించి పాక్ తన నైజాన్ని చాటుకుంది. ఆ దేశంలో రాజకీయ నాయకత్వానికీ, సైన్యానికీ ఎప్పుడూ సరైన సంబంధాలు ఉండవన్నది ప్రపంచానికి తెలిసిన సత్యం. కానీ సైనిక దళాలు సైతం ముఠాలుగా చీలివున్నాయని, వాటిపై ఎవరికీ అదుపులేదని తాజా పరిణామాలు నిరూపించాయి. ఈ నిజాన్ని గ్రహించకుండా, పాకిస్తాన్‌కు చీవాట్లు పెట్టకుండా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అణు యుద్ధాన్ని నివారించామని స్వోత్కర్షకు పోవటం... భారత్, పాక్‌లను ఒకే గాటన కట్టడం ఆశ్చర్య కరం. పాకిస్తాన్ చర్యల పర్యవసానం తమ వరకూ రానేరాదన్న భ్రమేదో ఆయనకున్నట్టుంది. కానీ ఉగ్రవాదాన్ని దుంపనాశనం చేయకపోతే అది ఏ దేశాన్నీ విడవకుండా మింగేస్తుందని ట్రంప్ గ్రహించటం అవసరం. ఉగ్రముఠాలను ప్రోత్సహించి ఊచకోతలను సాగిస్తున్న దేశాన్ని ఎవరైనా ఎలా ఉపేక్షించగలరు? దాని దగ్గర అణ్వాయుధాలున్నాయనీ, అది ముప్పు కలిగిస్తుందనీ... కనుక నోర్మూసుకు పడివుండాలనీ ట్రంప్ చెప్పదల్చుకున్నారా? వాణిజ్యాన్ని ఆపేస్తానని బెదిరించటంవల్ల రెండు దేశాలూ దారికొచ్చి కాల్పుల విరమణకు ఒప్పుకున్నాయని ఆయన అనటం కూడా అత్యంత అభ్యంతరకరమైంది. ఇలాంటి తర్కంతో ప్రోత్సహిస్తున్నదెవరినో గమనించుకుంటున్నారా? తాను ప్రపంచ దేశాలతో అధిక సుంకాల పేరిట యుద్ధం సాగిస్తున్నారు. గాజాలో ఇజ్రాయెల్‌ను నియంత్రించటం లేదు. అక్కడి మారణకాండను ఆపటం లేదు. మరి భారత్%-%పాక్ విషయంలో ఇంత ఆత్రుత దేనికో? ఎవరూ కోరకుండానే కశ్మీర్ సమస్యలో వేలెడతానని ఆయన తనకు తానుగా ఎలా చెప్పుకుంటారు? 2019లో సైతం ట్రంప్ ఇవే తరహా మాటలు మాట్లాడారు. ఆ తర్వాత జ్ఞానో దయమై ఆ సమస్యను రెండు దేశాలూ చర్చించి పరిష్కరించుకుంటాయని స్వరం మార్చారు. మళ్లీ ఇప్పుడేమైంది? తాజా ఘర్షణలకు మూలం ఎక్కడున్నదో ఆయన గ్రహించలేకపోయారని ట్రంప్ మాటలు గమనిస్తే తెలుస్తుంది. పహల్గామ్‌లో 26మంది పర్యాటకుల్ని పొట్టనబెట్టుకున్న ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'ని ప్రారంభించింది. పాక్‌లోని 24చోట్ల ఉగ్రముఠాల స్థావరాలను ధ్వంసం చేసింది. వందమంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. కశ్మీర్‌లో ఉగ్రవాదులు చేసిన దాడికిది ప్రతీకారమే తప్ప కశ్మీర్ సమస్య పరిష్కారాన్ని ఉద్దేశించి మొదలెట్టిన దాడులు కాదు. అమెరికాకు చిత్తశుద్ధి ఉంటే ఉగ్రవాదులకు ప్రోత్సాహం అందించినంతకాలమూ తమ వైపుగా ఎలాంటి సాయమూ అందబోదని పాకిస్తాన్‌కు చెప్పాలి. ఆ దేశంతో సంబంధ బాంధవ్యాలు కొన సాగించే దేశాలపై కూడా ఆంక్షలుంటాయని ప్రకటించాలి. కానీ అందుకు విరుద్ధంగా ఆ దేశం కారణంగా నష్టపోతున్న భారత్‌నూ, దాన్నీ ఒకే గాటన కట్టడం ఎలాంటి సందేశం పంపుతుంది? ఇరు దేశాల మధ్యా చర్చలంటూ ఉంటే అది కేవలం పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనా, ఉగ్రవాదుల అప్పగింతపైనా మాత్రమే ఉంటాయని తన సందేశంలో మోదీ చెప్పటం ప్రశంసించదగ్గది. అమెరికా పోకడలు గమనిస్తే వర్తమాన ప్రపంచంలో ఎలాంటి న్యాయం అమలవుతున్నదో స్పష్టంగానే అర్థమవుతుంది. దశాబ్దాలుగా చీకాకు పెడుతున్న ఉగ్రవాద సమస్యపై మోదీ దృఢ నిశ్చయాన్ని ప్రకటించటం ఈ తరహా న్యాయాన్ని ప్రశ్నించటమే!

# తిరోగమనంలో పురోగామి భారత్

భారత్ మరియు పాకిస్థాన్ తమ స్వతంత్రతను సాధించినప్పటికీ, ఆర్థిక, సామాజిక, రాజకీయ మార్గాల్లో అవి పూర్తిగా వేరుగా అభివృద్ధి చెందాయి. భారతదేశం తన ప్రజాస్వామిక, లౌకిక విలువలను కాపాడుకుంటూ, ప్రపంచ స్థాయిలో అభివృద్ధిని సాధించడమే కాక, పాకిస్థాన్‌తో పోల్చినప్పుడు అధిక స్థాయిలో ఉన్నది.



భారత్, పాకిస్థాన్‌లు ఏకోదరులు. బ్రిటిష్ వలస పాలన నుంచి ఏకకాలంలో విముక్తమై స్వతంత్ర దేశాలుగా ఆవిర్భవించాయి. ఉమ్మడి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వారసత్వమున్నప్పటికీ ఎనిమిది దశాబ్దాల స్వతంత్ర అస్తిత్వంలో అవి భిన్న బాటలలో నడిచాయి. భారత ఆర్థిక వ్యవస్థ శీఘ్రగతిన అభివృద్ధి చెందింది. భారత్ తలసరి ఆదాయం పాకిస్థాన్ తలసరి ఆదాయం కంటే రెఓండు రెట్లు ఎక్కువ. ఇండియా సమైక్యంగా ఉన్నది. పాకిస్థాన్ 1971లో, అత్యధిక జనాభా ఉన్న తన తూర్పు విభాగాన్ని కోల్పోయింది. తూర్పు పాకిస్థాన్ బంగ్లాదేశ్‌గా ప్రభవించింది. ఇండియా విధిగా ప్రతి ఐదేళ్ల కొకసారి ఎన్నికలు నిర్వహిస్తోంది. అధికారానికి వివిధ రాజకీయ పార్టీలు తీవ్రంగా పోటీడుతున్నాయి. పాకిస్థాన్‌లో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలి, ఫలితాలు ఎలా ఉండాలన్న విషయాన్ని సైనికాధికారులు నిర్ణయిస్తారు! పాకిస్థాన్ కంటే ఇండియా ఎందుకు మెరుగ్గా, సమున్నతంగా ఉన్నది? తమ మత ఔన్నత్యం ఉత్కృష్టమైనది కనుక ఇస్లాంపై స్వతస్సిద్ధ, ఆధిక్యత కలిగి ఉన్నదని, ఇదే భారత్ సమున్నతికి కారణమని హిందూ మత దురభిమానులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. సత్యమేమిటి? అది భిన్నంగా ఉన్నది.భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య (భారత రిపబ్లిక్) పితామహులు, మాతృమూర్తులు మత దురభిమానాన్ని తోసిపుచ్చారు. మత ప్రాతిపదిక ఆధిక్యతావాదాలను తిరస్కరించారు. ఇదే మనలను పాకిస్థాన్‌కు భిన్నంగా ప్రగతిశీల బాటలో నిలిపింది. భారత రాజ్యాంగం పురాతన హిందూ రాజరిక పాలనా నమూనాలను తిరస్కరించింది. ఒక వ్యక్తి, ఒక ఓటు ఆధారంగా ఉండే రాజకీయ వ్యవస్థ వైపు మొగ్గు చూపింది. కుల అసమానతలు, జెండర్ వివక్షలతో ఘనీభవించిన సంప్రదాయ సామాజిక నిచ్చెన మెట్ల వ్యవస్థను గర్హించింది. మతాన్ని రాజ్యవ్యవస్థతో మిళితం చేసేందుకు నిర్ద్వంద్వంగా నిరాకరించింది. పాకిస్థాన్ అలా చేసినప్పటికీ భారత్ తన లౌకిక, ప్రజాస్వామిక విశ్వాసాలకు పూర్తిగా కట్టుబడిపోయింది. స్వతంత్ర భారతదేశ నాయకులు ఆధునిక విజ్ఞానశాస్త్రానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. సహేతుక ఆలోచనా ధోరణులను పెంపొందించారు. ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించారు. భారత రిపబ్లిక్ సంస్థాపక విలువలు అయిన ప్రజాస్వామ్యం, బహుళత్వ వాదంను ఇండియా సదా గౌరవించలేదు, అనుసరించ లేదు. 1975%-%77 అత్యవసర పరిస్థితి కాలంలో దేశ ప్రజలకు ప్రజాస్వామిక హక్కులు, పౌర స్వేచ్ఛలు లభించలేదు. కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు రాజ్యవ్యవస్థ హింసాకాండను చవి చూశాయి. మైనారిటీలపై మళ్లీ మళ్లీ దాడులు జరుగుతూనే ఉన్నాయిబీ విదేశీయులపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. అయినప్పటికీ రిపబ్లిక్ సంస్థాపక విలువలు సుస్థిరంగా ఉన్నాయి. 1991లో లైసెన్స్%-%పర్మిట్%-%కోటా రాజ్ రద్దయిన దరిమిలా రెండున్నర దశాబ్దాలలో దేశంలో అద్వితీయమైన అభివృద్ధి జరిగింది. ఇండియా కనుక సంకుచిత ప్రాతిపదికలపై ప్రాంతాల వారిగా చీలిపోయినా, నిరంకుశ పాలనలో ఉండిపోయినా, లేక మత రాజ్యంగా పరిణమించినా ఆ అద్భుత ఆర్థిక ప్రగతి సాధ్యమయ్యేది కాదు. ప్రచ్ఛన్నయుద్ధానంతర పరిస్థితులు ఆర్థిక పురోగతికి కల్పించిన అవకాశాలను పాకిస్థాన్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఎందుకని? దేశ రాజకీయాలలో సైన్యం జోక్యం పెరిగిపోవడం, పాకిస్థానీయుల దైనందిన జీవితాలలో ఛాందసవాద ఇస్లాం ప్రభావం పెరిగి పోవడమే అందుకు కారణాలు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించడం, ఒసామా బిన్‌లాదెన్‌కు ఆశ్రయమివ్వడం, అణ్వస్త్రాల వ్యాప్తికి కీలకంగా తోడ్పడడం మొదలైనవి అంతర్జాతీయ సమాజంలో పాకిస్థాన్ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. భారత్, పాకిస్థాన్‌లు పూర్తిగా భిన్న బాటల్లో నడిచినప్పటికీ ప్రపంచ దేశాలు ఇప్పటికీ కొన్నిసార్లు రెండిటినీ ఒకే గాటన నిలబెడుతున్నాయి.

ప్రతి విషయంలోను ఉభయ దేశాలను కలిపి ప్రస్తావిస్తున్నాయి! కశ్మీర్‌పై మూడు యుద్ధాలు జరగడమే అందుకొక ప్రధాన కారణం. అయితే ఈ శతాబ్ది తొలినాళ్ల నాటికి భారత్ అన్ని విధాల అసాధారణ పురోగతి సాధించడంతో 'ఇండో%-%పాక్' ప్రశ్నపై తర్జనభర్జనలు ఆగిపోయాయి. ఇండియా తన అద్భుత పురోగతితో ఫలప్రదంగా పాకిస్థాన్‌తో తనను కలిపి చూసే ధోరణుల నుంచి బయటపడింది. అదే సమయంలో ఇండియాను చైనాతో కలిపి ప్రస్తావించడం ప్రారంభమయింది. 'చిండియా' అనే భావన బాగా ప్రాచుర్యం పొందింది. అయితే ఇండియా ప్రజాస్వామిక సంప్రదాయాలు, బహుళత్వవాద విలువల కారణంగా జపాన్, ఉత్తర అమెరికా, యూరోపియన్ దేశాల ప్రభుత్వాల, ప్రజల, మదుపుదారుల మద్దతును విశేషంగా పొందింది. అయితే ఇప్పుడు పహల్గాం ఉగ్రదాడి, దానికి మన ప్రభుత్వ ప్రతిస్పందన ఫలితంగా భారత్, పాకిస్థాన్‌ల గురించి కలిపికట్టుగా మాట్లాడడం మళ్లీ ప్రారంభమయింది. భారత్ సమున్నతిని తక్కువ చేసే విధంగా హైఫనేషన్‌ను మళ్లీ ఉపయోగిస్తున్నారు. భారత్, పాకిస్థాన్ అని విడివిడిగా కాకుండా భారత్%-%పాకిస్థాన్ అని ప్రస్తావిస్తున్నారు! భారత్, పాకిస్థాన్‌లు సమ స్థాయి దేశాలు అన్నట్టుగా డోనాల్డ్ ట్రంప్ స్పష్టాతి స్పష్టంగా మాట్లాడటం ప్రారంభించారు ఆ రెండూ 'గొప్ప' దేశాలనీ, రెండిటితోను తనకు మంచి సంబంధాలు ఉన్నాయనీ, కాల్పుల విరమణకు ఇరు దేశాల నాయకులను ఒప్పించానని, సరైన తీరులో ఉంటే వాణిజ్యం కొనసాగిస్తానని చెప్పానని ట్రంప్ వెల్లడించారు. పుండు మీద కారం చల్లినట్లగా కశ్మీర్‌పై 'వెయ్యి' సంవత్సరాలుగా జరుగుతున్న యుద్ధం విషయమై రెండు దేశాల మధ్య రాజీ కుదిర్చేందుకు మధ్యవర్తిత్వం నెరపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ట్రంప్ తెలిపారు. ట్రంప్ వాచాలుడు, అహంకారి, చంచల స్వభావి. అయితే ప్రపంచ అతి సంపన్న, మహాశక్తిమంతమైన దేశానికి అధ్యక్షుడు. ఆ దేశంతో మనకు కీలకమైన ఆర్థిక, రాజకీయ సంబంధాలు ఉన్నాయి. కనుక ఆయన మాటలు ఎంత ఆషామాషీగా ఉన్నప్పటికీ మనం గంభీరంగా వినాలి. వాటిపై ఆలోచించాలి. అయితే అంతర్జాతీయ మీడియా జగత్తులో భారత్, పాకిస్థాన్‌లను హైఫన్ (భారత్%-%పాకిస్థాన్)తో ప్రస్తావించడాన్ని ఉపేక్షించకూడదు. ఈ నెల 10వ తేదీన భారత్, పాకిస్థాన్‌ల మధ్య చెలరేగుతున్న ఘర్షణల నేపథ్యంపై 'ఫైనాన్సియల్ టైమ్స్' ఒక విపుల కథనాన్ని ప్రచురించింది. దాని శీర్షిక : '%ఇశీ తీవశ్రీఅస్త్రఅశీబం ర్‌తీశీఅస్త్రవవఅ ఎశ్రీఖంఫ్త్ర%' ప్రస్తావిత ఇద్దరు వ్యక్తులు అసీమ్ మునీర్, నరేంద్ర మోదీ! తమ పౌరులకు మెరుగైన జీవన స్థితిగతులను సమకూర్చడంలో పాకిస్థాన్ కంటే ఇండియా అన్ని విధాల ఉన్నతస్థాయిలో ఉందనడంలో సందేహం లేదు. అయినప్పటికీ మనకు మనం ఒక ప్రశ్న వేసుకునితీరాలి: ఇటీవలి సంవత్సరాలలో మనం తిరోగమించలేదా? అమెరికా పూర్వ అధ్యక్షులు జార్జి బుష్, బరాక్ ఒబామా, జో బైడెన్ ఎప్పుడైనా భారత్, పాకిస్థాన్‌లను జోడించి ప్రస్తావిం చారా? కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం నెరపుతామని ప్రతిపాదించారా? మన్మోహన్‌సింగ్, నరసింహారావు, రాజీవ్‌గాంధీ, దేవెగౌడ లేదా అటల్ బిహారి వాజపేయిలలో ఎవరినైనా %=వశ్రీఅస్త్రఅశీబం ర్‌తీశీఅస్త్రఖఅ%' అని ఫైనాన్సియల్ టైమ్స్ ఎప్పుడైనా ప్రస్తావించిందా? నిజానికి ఇండియా గత దశాబ్దంలో తిరోగమించిందని ఒక చరిత్రకారుడుగా, ఒక పౌరుడుగా నేను సునిశ్చితంగా వాదిస్తాను. ఇప్పటికీ మనం జాతీయ స్థాయిలోను, రాష్ట్రాల స్థాయిలోను ఎన్నికలను క్రమబద్ధంగా నిర్వహిస్తున్నాము.

అయితే ఆ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, సక్రమంగా జరుగుతున్నాయా అనే విషయమై న్యాయసమ్మతమైన సంశయాలు ఉన్నాయి. మీడియా చాలవరకు ప్రభుత్వ ప్రచారానికి ఒక ప్రధాన ఆలంబనగా ఉయోగపడుతోంది. రెగ్యులేటరీ, దర్యాప్తు సంస్థలు అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల గవర్నర్లు జాతీయ పాలక పక్షానికి అనుకూలంగా ఉంటూ సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తున్నారు. ప్రధానమంత్రి వ్యక్తిపూజ బ్రహ్మాండంగా వర్ధిల్లుతోంది%-% ప్రజల సొమ్ముతో సుమా! ఈ ఆరాధనా భావం మన ప్రజాస్వామ్య ప్రమాణాలను మరింతగా భ్రష్టుపరిచింది. మన ప్రజాస్వామ్యం అంతకంతకూ మరింత లోపభూయిష్టమవుతోంది. మన లౌకికవాద, బహుళత్వవాద విలువలపై దాడులు తీవ్రమవుతున్నాయి. ఇటీవల పాకిస్థాన్‌తో సంఘర్షణ సమయంలో అధికారప్రతినిధిగా ఒక ముస్లిం మహిళా సైనికాధికారిని నియమించడంలో ఉన్న ప్రతీకాత్మక విలువ, ఒక సీనియర్ బీజేపీ నాయకుడు ఆమెను అగౌరవపరుస్తూ చేసిన వ్యాఖ్యలతో, వ్యర్థమైపోయింది. ఇటీవలి సంవత్సరాలలో నోయిడా మీడియా, హిందూత్వవాదులు ఉధృతం చేసిన ముస్లిం వ్యతిరేక విష ప్రచారం రాబోయే నెలల్లో తగ్గిపోతుందో లేదో వేచి చూడవలసి ఉంది. పహల్గాం ఉగ్రవాద దాడి దరిమిలా కశ్మీర్ లోయలో అనేక మందిని అకారణంగా అరెస్ట్ చేశారు. పలువురి గృహాలను బుల్డోజర్‌తో కూల్చివేశారు. కశ్మీరీలకు సంతోషప్రదమైన భవిష్యత్తును, అవి సూచిస్తున్నాయా? పహల్గాం ఘటన, దాని పర్యవసానాల పట్ల అంతర్జాతీయ సమాజం ప్రతిస్పందనలు మనకు నేర్పుతున్నదేమిటి? భారత్‌ను పాకిస్థాన్‌తో జోడించి మాట్లాడేందుకు మళ్లీ జరుగుతున్న ప్రయత్నాలకు మనమెలా ప్రతిస్పందించాలి? నిరాలోచనపరుడు అయిన యుద్ధోన్మాది 'అర్బన్ నక్సల్స్'ను నిందిస్తాడు. బాధితుడి మనస్తత్వాన్ని ప్రదర్శిస్తాడు. ఆ తరువాత ఇండియా ఇప్పుడూ ఎప్పుడూ విశ్వగురుగా ఉండిపోతుందని ప్రకటిస్తాడు. ఆలోచనాశీలి అయిన దేశభక్తుడు ఆత్మపరిశీలన చేసుకోవడం ప్రారంభిస్తాడు. నిరంకుశ పాలనా ధోరణులు, మెజారిటేరియనిజం పెచ్చరిల్లిపోవడాన్ని గత దశాబ్దం చూసింది: ఇదే ఇండియాను పొరుగుదేశంతో పోల్చేందుకు పురిగొల్పుతోంది. కనుక మనం జాగ్రత్తగా ఆత్మపరీక్ష చేసుకోవాలి. మన రిపబ్లిక్ సంస్థాపక విలువలు అయిన ప్రజాస్వామ్యం, బహుళత్వవాదంకు పునరంకితమయ్యేందుకు కాలం మించి పోయిందా అనే ప్రశ్న వేసుకోవాలి.

# గ్రూప్-1పై పోరాటం ఆగదు

గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్తుంటే.. కేసీఆర్ ప్రభుత్వాన్ని మించిన సంక్షేమ సర్కారును తీసుకొస్తారేమోనని ప్రజలంతా ఆశించారు. కానీ, రేవంత్‌రెడ్డి నేతృతంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను కాలదన్ని తెలంగాణలో ఇందిరమ్మ ఎమర్జెన్సీ రాజ్యాన్ని తీసుకొచ్చింది. ఈ నయా ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ విధ్వంసం జరుగుతున్నది. ప్రశ్నించినవారిపై దాడులు, అక్రమ కేసులు, నిర్బంధాలు నిత్యకృత్యమయ్యాయి. తాజాగా టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–1 పోస్టుల భర్తీలో జరిగిన అవకతవకలపై ప్రశ్నించిన నాపై కేసు పెట్టారు. గ్రూప్–1 పోస్టుల భర్తీలో జరిగిన తప్పులను ఎత్తిచూపిన నెల తర్వాత కేసు పెట్టడం రేవంత్ సర్కారుకే చెల్లింది.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదిలోనే 2 లక్షలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆ పార్టీ నాయకులు ఎన్నికలకు ముందు ఊరూరా ఊదరగొట్టారు. యువత, నిరుద్యోగుల భుజాలపై మూడు రంగుల జెండాలను మోపి, వారి కష్టాన్ని నిచ్చెనగా మార్చుకొని రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠంపై కొలువయ్యిండు. ఏరు దాటే దాక ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడ మల్లన్న అన్నట్టుగా అవసరం తీరాక తెప్ప తగలేశారు. కాంగ్రెస్ జెండాలు మోసి మోసి యువత భుజాలపై అయిన పుండ్లపై కారం చల్లారు. కొత్త గా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకపోగా.. దేశంలో ఎక్కడా లేని విధంగా కొలువులు వద్దని ధర్నాలు, రాస్తారోకోలు రాష్ట్ర యువత చేస్తున్నారని ఊరూవాడా చాటింపు వేస్తున్నారు. అంతకుముందు నిరుద్యోగ భృతి వట్టి మాటేనని ఉపముఖ్యమంత్రి భట్టి తేల్చేశారు.భారీ గ్రూప్–1 నోటిఫికేషన్ ఇస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పి, గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 503 పోస్టులకు 60 పోస్టులను కలిపి తమ ఘనతగా ప్రచారం చేసుకున్నది. క్రెడిట్‌ది ఏముందిలే.. యువతకు కొలువులు వస్తే చాలని అనుకున్నాం. కానీ, కొత్తగా నోటిఫికేషన్లు ఇచ్చి, పోస్టులు పెంచుతామని చెప్పి.. పరీక్షలు కూడా సరిగ్గా నిర్వహించలేకపోయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం, టీజీపీఎస్సీ ఉదాసీనత కారణంగా గ్రూప్–1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదటి నుంచి తప్పులతడకగా మారింది.

లక్షల మంది అభ్యర్థులు రాసే నీట్, ఎప్‌సెట్ లాంటి పరీక్షలకే బయోమెట్రిక్ పద్ధతిని అమలు చేస్తుండగా, వేల మంది మాత్రమే రాసిన గ్రూప్–1 పరీక్షకు మాత్రం బయోమెట్రిక్ హాజరు లేకపోవడం విస్మయం కలిగిస్తున్నది. నోటిఫికేషన్‌లో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తామని టీజీపీఎస్సీ స్పష్టంగా పేర్కొన్నది. కానీ, ఆ తర్వాత తమ అస్మదీయులకు అయాచిత లబ్ధి చేకూర్చేందుకే బయోమెట్రిక్‌ను బుట్టదాఖలు చేసింది. అందుకే పరీక్ష ముగిసిన వెంటనే 21,075 మంది అభ్యర్థులు పరీక్ష రాశారని పేర్కొన్న టీజీపీఎస్సీ.. ఆ తర్వాత 10 మందిని అక్రమ మార్గంలో చేర్చింది.

ఆ పదిమంది పెరగడం నిజమేనని హైకోర్టు సాక్షిగా అంగీకరించిన టీజీపీఎస్సీ.. వారు ఏ ప్రాతిపదికన పెరిగారనే విషయంపై మాత్రం నోరు మెదపడం లేదు. అంతేకాదు, 20,161 మంది పరీక్షలు రాసినట్టుగా ఒకానొక సమయంలో అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొన్నది. హాల్‌టికెట్ల విషయంలోనూ అనుమానాలకు తావిచ్చే విధంగా గందరగోళం సృష్టించింది. ప్రిలిమ్స్‌కు ఒక హాల్ టికెట్, మెయిన్స్‌కు మరో హాల్‌టికెట్ ఇవ్వడం వెనుక కూడా ఏదో కుట్ర దాగి ఉన్నది.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 మహిళా కళాశాలల్లో గ్రూప్–1 పరీక్షలు జరగగా.. కోఠిలోని ఐలమ్మ మహిళా కళాశాల పరీక్షా కేంద్రంలో మాత్రమే ప్రత్యేకంగా మహిళా అభ్యర్థులను కేటాయించారు. ఇక్కడ రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా సుమారుగా 563 మంది పరీక్ష రాసినట్టు తెలుస్తున్నది. అయితే, ఎక్కడా లేని విధంగా ఈ ఒక్క పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసినవారిలో సుమారు 10 శాతం మంది అభ్యర్థులు గ్రూప్–1 కొలువులను కొల్లగొట్టారు. ఈ ఒక్క పరీక్షా కేంద్రం నుంచి సుమారు 60–70 మంది వరకు సెలక్ట్ అవ్వగా, ఇతర ప్రాంతాల్లోని 40కి పైగా పరీక్షా కేంద్రాల నుంచి ఒక్కరు కూడా సెలక్ట్ కాకపోవడం విడ్డూరం. కాంగ్రెస్ నేత రాములు నాయక్ కోడలు కూడా ఐలమ్మ పరీక్షా కేంద్రంలోనే పరీక్ష రాశారు. ఆమె ఎస్టీ క్యాటగిరీలో టాప్ ర్యాంకు సాధించారు. ఈ విషయాన్ని నేను గత నెలలో ప్రెస్‌మీట్ పెట్టి ప్రస్తావించాను. అప్పుడు ఎక్కడో కూడా కులాన్ని కించపరచలేదు. కానీ, కుట్రపూరితంగా నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. గ్రూప్–1 టాపర్లలో చాలామంది ఒకే పరీక్షా కేంద్రంలో, అందులోనూ ఒకే గదిలో పరీక్ష రాసినట్టు అనుమానాలు ఉన్నాయి. అంతేకాదు, హాల్‌టికెట్ నెంబర్‌లోని చివరి ఒక్క అంకె తేడాతో ఒకరి వెనుక ఒకరు కూర్చున్న చాలామంది అభ్యర్థులకు ఒకే విధమైన మార్కులు రావడం కూడా అనుమానాలకు తావిస్తున్నది. మరోవైపు తెలుగు మీడియం అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగింది

# పరమేశ్వర్ రెడ్డి చొరవతో పిట్టల బస్తీ రోడ్లకు రూ.50 లక్షల నిధులు మంజూరు







ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేసిన కాంగ్రెస్ నేతలు..

**ఉప్పల్,మే18 (సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ 5వ డివిజన్ మల్లాపూర్ లో ప్రభుత్వ పాఠశాల లైన్,పిట్టల బస్తీ రోడ్లుకు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి చొరవతో సుమారు రూ.50 లక్షణం మంజూరయ్యాయి.ఆదివారం మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయికిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా కప్పర సాయికిరణ్ గౌడ్ మాట్లాడుతూ... పరమేశ్వర్ రెడ్డి చొరవతో మల్లాపూర్ కు లక్షలాది రూపాయల నిధులు మంజూరయ్యాయని,అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని ఆయన సూచించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లక్షలాది రూపాయలను వెచ్చించి మల్లాపూర్ ని అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి, ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఉప్పల్ నియోజకవర్గానికి ఇప్పటి వరకు పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు రూ.200 కోట్లు నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు పీజీ సుదర్శన్, దంతూరి రాజుగౌడ్, కోయగూర బాలరాజ్,శ్రీకాంత్ రెడ్డి సురేష్, ఫాసద్దీన్,మనోహర్,శైలజ,దిలీప్ గౌడ్, నందలాల్, సోనీ,జయంత్,ఈర్షత్,భాను బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## బండారి రాజిరెడ్డికి ఘన నివాళులర్పించిన వివిధ పార్టీల నేతలు





**ఉప్పల్,మే18(సూర్యరేఖ)** చీర్యాలలోని బండారి వ్యవసాయ క్షేత్రంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే దివంగత నేత బండారి రాజి రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, నేతలు,ఎమ్మెల్యేలు,మాజీ ఎమ్మెల్యేలు,ఎంపీలు, కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు,పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,తనయుడు బండారి నీలంరెడ్డి, బండారి రాజిరెడ్డి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.బండారి రాజిరెడ్డి సుదీర్ఘకాలం ప్రజల కోసం చేసిన సేవలను ఈ సందర్భంగా నేతలు గుర్తు చేశారు.నిబద్ధతగల నేత బండారి రాజిరెడ్డి అని పేర్కొన్నారు.ఉప్పల్ ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయిన ఏకైక రాజకీయ నాయకుడు బండారి రాజిరెడ్డి అని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి ధ్యేయంగా పనిచేసిన నిస్వార్థ నేత బండారి రాజిరెడ్డి అని కొనియాడారు.అలాంటి నేత ప్రజలకు దూరం కావడం బాధాకరమైన విషయమని స్పష్టం చేశారు

# మెదక్ నియోజకవర్గంలో దూసుకెళ్తున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

పార్టీ కార్యకర్తలను,నాయకులను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి...

కంఠారెడ్డి తిరుపతిరెడ్డి,వైపే మొగ్గుచూపుతున్న కార్యకర్తలు నాయకులు..

త్వరలో తిరుపతిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరనున్న పలువురు కాంగ్రెస్ నాయకులు





**నిజాంపేట,మే18(సూర్యరేఖ)** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి,మెదక్ నియోజకవర్గంలో దూసుకెళ్తున్నాడు.బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కుటుంబాలకు అండగా ఉంటూ ప్రతి నిరుపేద కుటుంబాలకు రూ.5 వేల నుండి రూ.10వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తూ ముందుకు వెళ్తున్నాడు.గతంలో కాంగ్రెస్ పార్టీలో పని చేసిన ఆయన నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని సమయంలో కార్యకర్తలను నాయకులందరిని మమేకం చేసుకొని తనదైన శైలిలో పార్టీని కాపాడుకుంటూ వచ్చాడు.చివరకు ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించిన చివరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మొండి చేయి చూపి ఎమ్మెల్యే టికెట్ ను మైనంపల్లి రోహిత్ రావు కేటాయించడంతో కంఠారెడ్డి మనస్థాపాన్ని గురై మాజీ మంత్రివర్యులు కల్వకుంట తారక రామారావు,తన్నీరు హరీష్ రావు,ల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. ఆయన చేసిన సేవలను గుర్తించి బీ ఆర్ఎస్ లో మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి పదవిని కేటాయించారు.బీఆర్ఎస్ పార్టీలో స్థానిక మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఉన్నప్పటికీ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి వైపే బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మెగ్గు చూపడం చర్చనీయాశంగా మారింది.నియోజకవర్గంలో ప్రతి ప్రోగ్రాంలో తన వంతు శైలితో కార్యకర్తలను మమేకం చేసుకొని పెద్ద ఎత్తున కాన్వాయ్ తో బయలుదేరడంలో కాంగ్రెస్, బిజెపి పార్టీలకు అలాగే పద్మ దేవేందర్ రెడ్డి అనుచరులకు ఒక ట్విస్ట్ లా మారిందని పలువురు చర్చించుకుంటున్నారు.అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు కంఠా తిరుపతిరెడ్డి ఇచ్చిన విందుకు హాజరు కావడంతో మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కల్వకుంట పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలకు విచ్చేసిన ఆయన తిరుపతిరెడ్డి,కి కోవర్టులుగా పనిచేస్తున్నారని కాంగ్రెస్ నాయకులను కోపగించుకోవడంతో మనస్థాపానికి గురయ్యారు. నిజాంపేట మండల కాంగ్రెస్ నాయకులు త్వరలో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకునే ఆలోచనలో ఉన్నారని తెలుస్తుంది.దీంతో మండలంలో హాట్ టాపిక్ గా మారే అవకాశం ఉంది.రానున్న రోజుల్లో నిజాం పేట మండలంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగయ్యే అవకాశం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. రాబోయే రోజులలో బీఆర్ఎస్ పార్టీలో పద్మా దేవేందర్ రెడ్డి నాయకత్వం లేదా కంఠారెడ్డి తిరుపతిరెడ్డి నాయకత్వం బలపడుతుందా అని మండలంలో పలువురు ఆశావాదులు గుసగుస లాడుతున్నారు.

## మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలి..


వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికసాయం చెయ్యాలి..

అనుప్ కుమార్ బుగిడి.




**మెహిదీపట్నం,మే18(సూర్యరేఖ)** చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17మంది అభాగ్యులు మృత్యువాత పడడం పట్ల తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి అనుప్ కుమార్ బుగిడి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ,తీవ్ర సంతాపం ప్రకటించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అనుప్ కుమార్ బుగిడి మాట్లాడుతూ...అగ్నిప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించి కాపాడాలని,మరణించిన వారి కుటుంబాలకు తగు ఆర్థికసాయం చేసి అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించి,వారి కుటుంబాలకు అనుప్ కుమార్ బుగిడి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇలియాస్.



**కామారెడ్డి,మే18(సూర్యరేఖ)** కామారెడ్డి నియోజకవర్గంలోని పలువురు కార్యకర్తలు,నాయకుల కుమారుల.కూతుళ్ళ శుభకార్యాలకు షబ్బీర్ అలీ తనయుడు మహమ్మద్ ఇలియాస్ వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. తనాయుడు ఇలియాస్ అలీ వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి,టిపిసిసి సెక్రటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి,కామారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్ రెడ్డి,ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్,లక్కపత్ని గంగాధర్ వివిధ మండలాల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

## నూతన వధువరులను ఆశీర్వదించిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



**మెహిదీపట్నం,మే18(సూర్యరేఖ)** గుడిమల్కాపూర్ డివిజన్ పరిధిలోగల రథన్ మహల్ ఫంక్షన్ హాల్ లో జరిగిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు గురజాల జ్యోతి రాధాకృష్ణల కుమార్తె పావని వివాహ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి,సెంట్రాల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్ రెడ్డి,సెంట్రాల్ జోన్ నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ అద్యక్షులు దేవర వంశీలతో పాటు పలువురు భాజాపా నాయకులు పాల్గొని ఆశీర్వదించారు.

# ఉప్పల్ మినీ శిల్పారామం లో అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు






**ఉప్పల్,మే18(సూర్యరేఖ)** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం కళాభూమి ది డెస్టినేషన్ అఫ్ ఆర్ట్స్ వారి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది.గురువు మధసూధన్ గురువు మోహన్ రెడ్డి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూషిక వాహన,శ్రీ విఘ్నారాజం భజే, అష్టలక్ష్మి నమశ్శివా యతే,చూడరమ్మ,మహేశ్వరి మహాకాళి వినాయక కౌతం,గజవదాన,భజరే గోపాలం జతిస్వరం రామాయణ శబ్దం,దేవ దేవం భజే అంశాలను ప్రణవి తన్వీ హేతిక మైథిల్యా ఆర్వీ, అదవిత వైభవి శ్రీనిజ ధ్రువి రిత్విక కీర్తిక రిథిమా, మోక్షిత మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## దివంగత ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి ఘనంగా నివాళులర్పించిన కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్



**ఉప్పల్,మే18 (సూర్యరేఖ)** చిర్యాలలోని బండారి వ్యవసాయ క్షేత్రంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే దివంగత నేత బండారి రాజిరెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలు వేసి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కౌకొండ జగన్,బింగి శ్రీనివాస్, బాలు,పుష్పరాజ్ శ్యామ్,ముద్దం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొని రాజిరెడ్డికి నివాళులర్పించారు.

# ఆడపడుచు వివాహానికి ఆర్థిక సాయం..



**శివంపేట,మే18 (సూర్యరేఖ)**శివంపేట మండలంలోని దొంతి గ్రామంలో బేగంపేట్ బాలయ్య మల్లమ్మ కూతురు వివాహానికి ప్రజా నాయకుడు ప్రముఖ సంఘ సేవకులు,తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్త వారి సొంత నిధుల నుండి రూ.5వేలు ఆర్థిక సాయం ఆ కుటుంబానికి అందజేశారు. బాలయ్య కుటుంబ సభ్యులు మహేష్ గుప్తకి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మి కుమార్,మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ,సీనియర్ నాయకులు నిరుడి బాబు,జెసిబి పిట్ల సత్యనారాయణ,సాకలి దశరథ,నల్ల రాములు,కోదాస్ స్వామి,గౌస్ పాషా, జగని చంద్రం,కంచుగారి శ్యామ్,కోదాస్ మహేందర్, బుద్దుల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# భారత సైన్యానికి సంఘీభావంగా తిరంగా ర్యాలీలో మేముసైతం..బండారు రాధిక



**మెహిదీపట్నం,మే18 (సూర్యరేఖ)** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో ట్యాంక్ బండ్ రోడ్డులో శనివారం సాయంత్రం నిర్వహించిన తిరంగా ర్యాలీలో భారత సైన్యానికి సంఘీభావంగా మేముసైతం అంటూ భారతీయ జనతా పార్టీ గోల్కొండ జిల్లా ఉపాధ్యక్షురాలు బండారు రాధిక పార్టీ, పార్టీ అనుబంధ సంఘాల నాయకురాళ్లతో అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బండారు రాధిక మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోందని అంతర్జాతీయ సమాజం ముందు బట్ట బయలైందన్నారు. ప్రస్తుత సమయంలో ప్రజలందరూ భారత ప్రభుత్వానికి భారత సైన్యానికి అండగా నిలవాలని,అంతర్గతంగా ఉన్న దేశ విచ్ఛిన్నకర శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.దేశ శ్రేయస్సు కోసం పాటు పడుతున్నా దేశ ప్రధాని మోడీకి మనం మద్దత్తుగా ఉంటూ బుద్ధి మారని పాకిస్తాన్ కు మన దేశ సైన్యం సమర్ధవంతంగా తగిన జవాబు ఇస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బండారు రాధికతో అమృత,స్వరూప,విజయ లక్ష్మి సుహాసిని తధితరులు భారి సంఖ్య పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి సీసీ రోడ్డుకు కృషి చేసిన ఎమ్మెల్యే..



**నిజాంపేట,మే18(సూర్యరేఖ)** మండల పరిధిలోని రాంపూర్ ఎల్లమ్మ ఆలయానికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో సీసీ రోడ్డు నిర్మించారు.ఈ సందర్భంగా గౌడ కులస్థులు మాట్లాడుతూ...శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవం సందర్భంగా ఆలయానికి సీసీ రోడ్డు వేయించాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కోరగా వెంటనే రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.సీసీ రోడ్డుకు సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామగౌడ కులస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా పోచమ్మ తల్లి కి బోనాలు..



**నిజాంపేట,మే18(సూర్యరేఖ)**మండల కేంద్రంలో రజక కులస్తుల ఆరాధ్య దైవమైనటువంటి శ్రీ మడేలేశ్వర శీతాలదేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం రజక కులస్తులు పోచమ్మ బోనాలను బైండ్ల వారి నృత్యాల మధ్య ఊరేగింపుగా తరలి పోచమ్మ వారికి ధూప దీప నైవేద్యాలతో బోనాలను సమర్పించారు.అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మడేలేశ్వర స్వామిని వేడుకున్నమని తెలిపారు.ఈ కార్యక్రమంలో రజక కుల సంఘ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాలొచ్చాయి..

**బడులు తెరిచే నాటికి పంపిణీకి చర్యలు..**



**మెదక్,మే18(సూర్యరేఖ)** కొత్త విద్యాసంవత్సరంలో పాఠశాలలు తెరిచేలోపు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఈ మేరకు పుస్తకాల సరఫరాకు చర్యలు చేపట్టింది.ఈ విద్యా సంవత్సరంలో ప్రణాళిక ప్రకారం ముందే ముద్రణకు శ్రీకారం చుట్టింది.ఏప్రిల్ నుంచే ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.దీంతో 80 శాతానికి పైగా ఆయా తరగతుల పుస్తకాలు జిల్లాకు చేరాయి.జిల్లాలో 623 ప్రభుత్వ ప్రాథమిక,128 ప్రాథమికోన్నత,146 ఉన్నత పాఠశాలలు,15 కస్తూర్బా,7 ఆదర్శ,27 గురుకుల విద్యాలయాలు ఉన్నాయి.ఆయా వాటిల్లో 83,305 మంది చదువుకుంటున్నారు. వీరికి 4.60 లక్షల పుస్తకాలు అవసరమని విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు.ఇప్పటికే గోదాములో పాతవి 38 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యాసంవత్సరం ఆరంభంలో పార్ట్-1 పుస్తకాలు అందించనున్నారు.ఎస్ఎ-1 పరీక్షలు పూర్తయ్యాక సెప్టెంబరు,అక్టోబరులో పార్ట్-2 పంపిణీ చేయనున్నారు.


**నేరుగా పాఠశాలలకే..**

విద్యార్థులకు ఎలాంటి ఖర్చు లేకుండా రెండేళ్ల నుంచి రాత పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. సర్కారు బడుల్లో ఇది వరకు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల నుంచి ఇంటర్ వరకు చదివే వారికి ఉచితంగా రాత పుస్తకాలు అందజేశారు.ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రాథమిక స్థాయి వారికి సైతం ఇవ్వనున్నారు. రాత పుస్తకాలు సైతం ఇది వరకు జిల్లా గోదాముకే చేరేవి.కానీ ఈ సారి నుంచి నేరుగా ముద్రణ కేంద్రం నుంచి పాఠశాలలకు చేరవేయనున్నారు.

**83 శాతం రాక..**

జిల్లా కేంద్రంలోని పాఠ్యపుస్తకాల గోదాముకు 3.84 లక్షల పుస్తకాలు వచ్చాయి.ఒకటి నుంచి పదో తరగతి వరకు అన్ని మాధ్యమాలకు చెందిన 138 టైటిల్స్ అవసరం కాగా,ఇప్పటి వరకు 117 టైటిల్స్ పుస్తకాలు వచ్చాయి.ఇంకా 21 టైటిల్స్ పుస్తకాలు రావాల్సి ఉంది.మిగతా 1.04 లక్షల పుస్తకాలు రానున్నాయి.ఆదివారం నుంచి జిల్లా గోదాం నుంచి మండల వనరుల కేంద్రాలకు చేరవేయనున్నారు.

## ధోతి ఫంక్షన్ హాజరైన తోటి మిత్రులు..



**నిజాంపేట,మే18(సూర్యరేఖ)** మండల కేంద్రానికి చెందిన సామల సుమ రమేష్,లకూతురు స్ఫూర్తి,కుమారుడు హర్షవర్ధన్,ల ధోతిఫంక్షన్ కు తోటి స్నేహితులు హాజరై ఆశీర్వదించారు.22 సంవత్సరాల తర్వాత టెన్త్ క్లాస్ బ్యాచ్ స్నేహితులు ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషంగా ఉందని వారు చదువుకున్న రోజులను గుర్తు చేసుకొని సంతోషపడ్డామన్నారు.ఈ కార్యక్రమంలోతోటి స్నేహితులు పంపరి నరేష్,రాము, స్వామి రాజునాయక్,జీడి.చంద్రకాంత్ గౌడ్,రాజు నరేష్,తదితరులు ఉన్నారు.

# రాజకీయ నాయకులకు,వ్యాపారవేత్తలకు గురు పీఠ విగ్రహ ప్రతి ఆహ్వాన పత్రిక అందుచేత





**శివంపేట,మే18 (సూర్యరేఖ)** శివంపేట మండలంలోని గూడూరు గ్రామంలో గురు పీఠంలో జరిగే విగ్ర ప్రతిష్ట మహోత్సవానికి కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు వివేక్ ని,మెదక్ మాజీ శాసనసభ్యులు పద్మా దేవేందర్ రెడ్డి,తాజా మాజీ ఉపసభావతి,మాజీ అటవిశాఖ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి,మాజీ శాసనసభ్యులు ఏనుగు రెవెన్యూ రవీందర్ రెడ్డి,వ్యాపారవేత్త శ్రీకల్లూరి హనుమంతరావు,రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు,ప్రముఖ సంఘ సేవకులు, వ్యాపార వేత్త,శ్రీనివాస్ మీనాక్షి సిమెంట్ అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త శంకరం పేట జడ్పిటిసి, తదితరులను కలిసి శ్రీగురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్, ట్రస్టు సభ్యులు బీఆర్ఎస్ శివంపేట మండల అధ్యక్షులు రాజార మణగౌడ్ తాజా మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ గొర్రె వెంకట్ రెడ్డి,తాజా మాజీ ఆత్మ కమిటీ కమిటీ చైర్మన్ జూన్ 5వ తేదీన జరిగే శ్రీ దత్తాత్రే య మహా స్వామి,శ్రీ షిరిడి సాయిబాబా ప్రాణ ప్రతిష్ట పూజ ఆహ్వాన పత్రికను అందజేసి ప్రాణప్ర తిష్ట కార్యక్రమానికి కోరారు.శివంపేట మండల కేంద్రంలోని గూడూరు గ్రామాన్ని ఎంతో ఆధ్యాత్మి క కేంద్రంగా మారుస్తూ,చరిత్రలో నిలిచిపోయే ఒక అద్భుత ఘట్టంగా మందిరాన్ని తీర్చిదిద్దారు.ఈ సందర్భంగా తాజా మాజీ మెదక్ శాసనసభ్యులు పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ. శ్రీగురు పీఠం వ్యవస్థాపకులు జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ కొనియాడారు.అందరు ఆహ్వానానికి ప్రతి స్పందనగా తప్పకుండా వస్తామని చెప్పారు.

# మైలార్‌దేవ్‌పల్లిలో మూడంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం





**50 మందిని ప్రాణాలతో కాపాడినట్లు పోలీసులు..**
**ఊపిరి పీల్చుకున్న పోలీసులు..**




**రాజేంద్రనగర్,మే18 (సూర్యరేఖ)** నగర శివారు మైలార్‌దేవ్‌పల్లిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మొగల్స్ కాలని ప్రాంతానికి చెందిన షేక్ మాజీద్ మూడంతస్తుల భవనాన్ని నిర్మించాడు. మాజీద్ తో పాటు మరో ఏడు కుటుంబాలు ఈ ఇంట్లో అద్దెకు ఉంటున్నాయి. ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో గ్రౌండ్ ఫ్లోర్లోని విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసిన ప్రాంతంలో షాట్ సర్క్యూట్ ఏర్పడింది.ఈ సంఘటనలో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి.ఈ మంటల దాటికి గ్రౌండ్ ఫ్లోర్లో ఇంటి యజమాని ఏర్పాటు చేసుకున్న పాత ఫర్నిచర్ తో పాటు ఇతర వ్యర్థాలకు మంటలు అంటుకొని అగ్నికీలలు ఎగిసిపడ్డాయి.ఆ భవనంలో ఉంటున్న నివాసితులు తీవ్రభయాందోళనకు గురై భవనంపైకి ఎక్కారు.స్థానికులు ఉప్పర్ పల్లిలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.ఫైర్ సిబది అప్పటికే పాతబస్తీలో జరిగిన అగ్ని ప్రమాదం ప్రాంతానికి వెళ్లడంతో విషయాన్ని చంద్రయాణగుట్ట ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఫైర్ స్టేషన్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అగ్నిమాపక సిబ్బంది,పోలీసులు నివాసితులను సురక్షితంగా ప్రాణాలతో కాపాడారు.మొత్తం 50 మందిని ప్రాణాలతో కాపాడినట్లు పోలీసులు తెలిపారు.వీరిలో 15 ఏండ్ల లోపు వారు 16 మంది ఉన్నారు.మంటలను అదుపు చేసేందుకు గంటన్నర పాటు తీవ్రంగా పోలీసులు శ్రమించారు.దీంతో వారందరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.ఫైర్ సిబ్బంది చాకచక్యంగా మొదట చిన్నారులను అనంతరం వృద్ధులను బయటికి తీసుకువచ్చారు.షార్ట్ సర్క్యూట్ కారణంగానే మూడంతస్తుల భవనంలో మంటలు చెలరేగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో యాగశాల కోసం భూమి పూజ

**రాజేంద్రనగర్,మే18(సూర్యరేఖ)** రాజేంద్రనర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ హైందవనగర్ లో ఈనెల మే 23 శుక్రవారం నుండి 25 ఆదివారం వరకు నిర్వహించబోయే శ్రీ ప్రణవభక్త సమాజం ఏకశతపంచొత్తర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు మోండ్ర నర్సింహ్మా అన్నారు. అందులో భాగంగా ఆదివారం యాగశాల కోసం భూమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. భక్త సమాజం ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహించు కోవడం జరుగుతుందన్నారు.భక్తులు అందరూ సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రణవభక్త సమాజం ఉపాధ్యక్షులు బర్ల మల్లారెడ్డి,ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి,సాబాద విజయ్ కుమార్,సభ్యులు సుల్గె మహేందర్, విద్యాసాగర్,సాయి యాదవ్ కిషన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచు వివాహానికి పుస్తె మెట్టెలు అందజేత..



**శివంపేట,మే18(సూర్యరేఖ)** శివంపేట మండలంలోని ఉసిరికపల్లి తౌర్య (లాలు తండా)లో జరుపుల పంతు,చిన్న పద్మ దంపతుల వారి కూతురు వివాహానికి ప్రముఖ సంఘ సేవకులు తాజా మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త వారి సొంత నిధుల నుండి పుస్తె మెట్టెలు ఆ కుటుంబానికి అందజేశారు.అడగ్గానే నేనున్నానంటూ వెంటనే స్పందించి పుస్తె మెట్టెలు అందజేసిన పబ్బ మహేష్ గుప్త కు జరుపుల పంతు దంపతుల వారి కుటుంబం తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సినియర్ నాయకులు కృష్ణారావు జరుపుల భాస్కర్,జరుపుల శ్రీనివాస్, పత్లోత్ విజేష్,కిషన్,రవి,విట్టల్,కేతావత్ సంతోష్, తండా నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డైనమిక్ లీడర్ గంజి రఘునాథ్ జన్మదిన వేడుకలు..



**మెహిదీపట్నం,మే18 (సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ గోల్కొండ జిల్లా కార్యవర్గ సబ్యుడు గంజి రఘునాథ్ జన్మదిన వెడుకలు ఘనంగా జరిగియి.భారతీయ జనతా పార్టీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తేలిపారు.జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో సెంట్రల్ జోన్ నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ అద్యక్షులు దేవర వంశీ,కిషోర్ యాదవ్,రాధాకృష్ణ యాదవ్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత.



**శివంపేట,మే18 (సూర్యరేఖ)** శివంపేట మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి సహకారంతో రూ.60 వేల చెక్కు మంజూరు అయింది.ఆదివారం బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే చెక్కు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అనేది పేదలకు ఎంతో గాను ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

## సిరిసిల్లలో క్రికెట్ స్టేడియం పరిశీలించిన ప్రభుత్వ విఫ్ అది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,లు



**రాజన్న సిరిసిల్ల,మే18 (సూర్యరేఖ)** సిరిసిల్ల పట్టణములో క్రీడాకారులకు క్రికెట్ మైదానానికి సంబంధించి స్థలాన్ని ప్రభుత్వ విఫ్ అది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,లు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప,ఆర్డీవో వెంకటేశ్వర్లు,స్థానిక ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి








**మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ**

**రాజేంద్రనగర్,మే18(సూర్యరేఖ)** ఉచిత వైద్య శిభిరాలను పేద ప్రజలు సద్వినియోగించుకోవాలని మాజీ కౌన్సిలర్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ కురుమ అన్నారు.మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని దివంగత డాక్టర్ పోతన పేరుపై శ్రీ చంద్ర హాస్పిటల్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్. వెంకటష్ మాట్లాడుతూ...శ్రీ చంద్ర హాస్పిటల్ డాక్టర్ భరత్ వర్ధన్ రెడ్డి బాబుల్ రెడ్డినగర్‌లో పేదలను దృష్టిలో ఉంచుకొని వారికి డాక్టర్ పోతన్న పేరుపై ఉచితంగా వైద్య సేవలు అందించడం గొప్ప విషయమన్నారు.ఈసీజీ గానీ,షుగర్ టెస్ట్ తో పాటు బీపీ టెస్ట్ ఉచితంగా మందులు అందజేయడం జరిగిందన్నారు.వైద్య శిబిరాన్ని నిర్వహించిన వైద్యులు వచ్చిన రోగులను వృద్ధులను భుజం తట్టి ఆప్యాయంగా పలకరించి వారికి కావలసిన మందులు ఇవ్వడంతో రోగులంతా సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పోతున్న వారి కుటుంబ సభ్యులతో పాటు సోమ శ్రీనివాస్ గుప్తా,డాక్టర్ నరిత రెడ్డి,డాక్టర్ సుస్మిత రెడ్డి,డాక్టర్ షోయాప్,డాక్టర్ సౌమ్య శ్రీ,ఉప్పల్ శ్రీను వెంకటరమణగుప్తా అశోక్ కుమార్,సంతూ గౌడ్ విజయ్,బొంబాయి రవి గోపాల్ నాయక్ రాము కురుమప్ప మధుసూదన్ రెడ్డి,డాక్టర్ కృష్ణ,డాక్టర్ కుమార్ డాక్టర్ రామకృష్ణ,డాక్టర్ మురళి,డాక్టర్ మల్లేష్ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 700కు పైగా జిల్లాల్లో వ్యవసాయ సంకల్ప్ అభియాన్







**కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్**

**రాజేంద్రనగర్,మే18(సూర్యరేఖ)** కేంద్ర వ్యవసాయం,రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ,భారత వ్యవసాయ పరిశోధన మండలి అభివృద్ధి చేసిన కృషి సంకల్ప్ అభియాన్ దేశవ్యాప్తంగా నిర్వహించబడుతుందని ఐసీఏఆర్ సెంట్రల్ డ్రైల్యాండ్ వ్యవసాయ పరిశోధన సంస్థ (సీఆర్ఐడీఏ),హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సింగ్ తెలిపారు.ఈ ప్రచారం మే 29 నుంచి ప్రారంభమై జూన్ 12 వరకు 700 కుపైగా జిల్లాల్లో కొనసాగుతుందని కేంద్ర వ్యవసాయం,రైతు సంక్షేమం,గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు మంత్రిత్వ శాఖ అధికారులు ఉద్యోగులు స్థానిక వ్యవసాయ కార్మికులతో బృందాలను ఏర్పాటు చేసి,ప్రతిరోజూ వివిధ గ్రామాలను సందర్శిస్తారు,రైతులతో నేరుగా సంభాషిస్తారు వారి స్థాయిలో వ్యవసాయం గురించి వారికి మరింత అవగాహన కల్పిస్తారు తగిన సలహాలు ఇస్తారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన ప్రయోగశాల నుండి భూమికి అనే మంత్రాన్ని సాకారం చేసుకునేందుకు ఈ కసరత్తు అంతా జరుగుతోందన్నారు.ఆధునిక,ఆదర్శ వ్యవసాయం తో పాటు,ఇది ఒక దేశం,ఒక వ్యవసాయం,ఒక బృందం వైపు ఒక ముఖ్యమైన చొరవ,కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా ఈ విషయంలో ఢిల్లీలో ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు.దీనిలో దేశవ్యాప్తంగా 731 కృషి విజ్ఞాన కేంద్రాలు దేశవ్యాప్తంగా 100 కు పైగా ఐసీఏఆర్ సంస్థలు ఇతర సంస్థలు,అలాగే కేంద్ర వ్యవసాయం,రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు హైబ్రిడ్ రీతిలో పాల్గొన్నారు.కేంద్ర వ్యవసాయ కార్యదర్శి దేవేష్ చతుర్వేది ఐసిఎఆర్ డైరెక్టర్ జనరల్,వ్యవసాయ పరిశోధన, విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ మంగి లాల్ జాట్ కూడా సమావేశంలో పాల్గొన్నారు.

## నేడు తిరంగా యాత్ర




**కామారెడ్డి,మే18(సూర్యరేఖ)** ఆపరేషన్ సింధూరు విజయం త్రివిధ దళాలకు వందనం చేస్తూ త్రివిధ దళాల సేవలకు కృతజ్ఞతగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు కామారెడ్డి గాంధీ గంజీ నుంచి యాత్ర ప్రారంభమవుతుందని భారతీయ జనతా పార్టీ మాజీ కౌన్సిలర్ జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ కాసర్ల శ్రీనివాస్ తెలిపారు.పాకిస్థాన్ ఉగ్రవాదంపై భారత సైన్యం విజయదుందుభి మోగించినందుకు మన సైనికుల ఆత్మవిశ్వాసం ధైర్యసహసాలకు దేశమంతా జేజేలు పలుకుతోందని ఆయన అన్నారు.తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించుకుందామని ఆయన తెలిపారు.కావున బంధువులు కామారెడ్డి పుర ప్రముఖులు పార్టీలకతీతంగా ఈ యాత్రలో పాల్గొని త్రివిధ దళాల సేవలకు కృతజ్ఞతగా తిరంగాయాత్రను విజయవంతం చేద్దామని అన్నారు.ఆపరేషన్ సింధూర్ భారీ విజయవంతం చేయడానికి భూమిపై,గాలిలో సముద్రంలో ధైర్యంగా పోరాడిన మన సైనికుల ధైర్య సాహసాలను గౌరవించేందుకు కామారెడ్డి ప్రజలు తిరంగాయాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

## వరల్డ్ క్యాండిల్ లైట్ డే




**కామారెడ్డి,మే18(సూర్య రేఖ)** కామారెడ్డి జిజిహెచ్ ఆస్పత్రి ఆవరణలో ఆదివారం సాయంత్రం క్యాండిల్ లైట్ డే నిర్వహించారు. హెచ్ఐవీ ఎయిడ్స్ భారీన పడి చనిపోయిన బాధితుల స్మారకార్థం సందర్భంగా ప్రతి ఏటా ఈ నెల మూడవ ఆదివారం క్యాండిల్ లైట్ డే నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ఆసుపత్రి ఆవరణలో కొవ్వొత్తులను వెలిగించి ర్యాలీని ఎన్ హెచ్ ఎం డీపీఓ పద్మజా,ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ,డాక్టర్ ప్రీతి కమల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఆస్పత్రి నుంచి ఇందిరా గాంధీ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగించారు.హెచ్ఐవి ఎయిడ్స్ భారీన పడి చనిపోయిన వ్యక్తుల ఆత్మకు శాంతి కలగాలని వారు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్టీ,ఐసిటిసి కౌన్సిలర్లు మేక నాగరాజు,గోపాల్,మెహరాజ్,ప్రవీణ్,లలిత కుమారి,వర్డ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు రాణి,రమేష్,వైఆర్జీ కేర్ డీఆర్పీ సుధాకర్,సేవా సంఘం పీఎం గోపాల్,సిబ్బంది,ఐఎస్ఆర్డీ ప్రతినిధి రాజేందర్,వివిధ ఎన్జీవోల ఔట్రిచ్ వర్కర్లు పాల్గొన్నారు.

## ఘనంగా ముదిరాజ్ రవికుమార్ వివాహం






**అందోల్,ఏప్రిల్18(సూర్యరేఖ)** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం సిరూర్ గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు అశోక్ ముదిరాజ్ తమ్ముని వివాహం ఘనంగా జరిగింది.ఈ వివాహానికి ముఖ్య అతిథులుగా దుద్దాల మహారాజ్ మాజీ శాసనసభ్యులు క్రాంతి కిరణ్,డిక్కీ చైర్మన్ రాహుల్ డీసీసీబీ మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్,మాజీ ఎంపీపీ బస్వారాజ్ పటేల్,మాజీ విద్య అధికారి అంజయ్య,ముదిరాజ్ సంఘం రాయికోడ్ మండలం అధ్యక్షులు రాజు జర్నలిస్ట్ శేఖర్,మాజీ సర్పంచ్ నవీన్,విట్టల్ రెడ్డి మక్సుద్ లక్ష్మణ్ జాహిర్,దనశెట్టి పండరి,వివిధ గ్రామాల బందు మిత్రులు శ్రేయభిలాషులు అభిమానులు భారీగా పాల్గొని నూతన వదువరులను అశర్వదించారు.

## తిరంగా యాత్రలో పాల్గొందాం

**క్రేడ అధ్యక్షులు లక్ష్మీ నరసా గౌడ్**




**కామారెడ్డి,మే18(సూర్య రేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీ గంజి నుంచి ప్రారంభమయ్యే తిరంగా యాత్రను పార్టీలకతీతంగా కామారెడ్డి ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని క్రేడ సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నరసా గౌడ్ ప్రజలకు పిలుపునిచ్చారు.ఆపరేషన్ సింధూర్ ను భారీ విజయవంతం చేయడానికి భూమిపై గాలిలో,సముద్రంలో ధైర్యంగా పోరాడిన మన సైనికుల ధైర్య సాహసలను గౌరవించేందుకు క్రేడా సభ్యులు అందరూ పార్టీలకు అతీతంగా తిరంగాయాత్రలో ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని లక్ష్మీ నరసాగౌడ్ తెలిపారు.

# ఘనంగా ప్రభాత ఉదయం మేనేజింగ్ డైరెక్టర్ మేకల దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలు








**రాజేంద్రనగర్,మే18(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ సర్కిల్ టియుడబ్ల్యూజే అధ్యక్షుడు,ప్రభాత ఉదయం మేనేజింగ్ డైరెక్టర్,హైదర్ గూడ వాస్తవ్యులు మేకల దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం సహచర పాత్రికేయుల కుటుంబ సభ్యుల ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కేరళలోని మునార్ లో గల మూన్ లైన్ హెూటల్ లో జరిగిన జన్మదిన వేడుకలలో పాత్రికేయులు అప్పారెడ్డి గూడెం భీమయ్య, మెక్కొండ ప్రేమ్ రాజ్,బుడిగేల బాబురావు,వర్కాల చందు కోరని మహేష్,గద్దె యాదగిరి,ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేకల దామోదర్ రెడ్డి,మేకల వనితారెడ్డి,ల చేత కేక్ కట్ చేయించారు.

**-రాజేంద్రనగర్ సర్కిల్ జర్నలిస్టు సంఘం అధ్యక్షులు గా..**

మేకల దామోదర్ రెడ్డి రాజేంద్రనగర్ జర్నలిస్టులు సంఘం అధ్యక్షుడుగా,ప్రభాత ఉదయం మేనేజింగ్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు.మేకల దామోదర్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, భగవంతుడు ఇష్టైశ్వర్యాలను ప్రసాదించాలన్నారు.



## తెలంగాణ సచివాలయ సందర్శనలో ప్రపంచ ముద్దుగుమ్మలు



**హైదరాబాద్,మే18(సూర్యరేఖ):**ప్రపంచ సుందరీమణులంతా హైదరాబాద్ అతిథ్యానికి ఫిదా అవుతున్నారు.రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలన్నింటినీ చుట్టేస్తున్న ఈ అందగత్తెలు..తాజాగా తెలంగాణ సచివాలయ సందర్శనకు వెళ్లారు.అక్కడి తెలంగాణ తల్లి విగ్రహానికి నమస్కరించి..ఫొటోలకు పోజులిచ్చారు.సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు.సచివాలయ పరిసరాల్లో కలియతిరిగారు.తెలంగాణ ప్రత్యేక వంటకాలతో రాష్ట్ర ప్రభుత్వం వారికి తేనీటి విందు ఏర్పాటు చేసింది.

**ఆకట్టుకున్న డ్రోన్ ప్రదర్శన..**

మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ తెలంగాణ సచివాలయ సందర్శన సందర్భంగా ఏర్పాటు చేసిన డ్రోన్ షో విశేషంగా ఆకట్టుకుంది.డ్రోన్ల ద్వారా తెలంగాణ తల్లి రూపాన్ని ఆవిష్కరించారు.డ్రోన్ షో ద్వారా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ,రూ.500 గ్యాస్ సిలిండర్,మహాలక్ష్మిలాంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రదర్శించారు.తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ ఆకృతుల్లో డ్రోన్లను ప్రదర్శించారు. మువ్వన్నెల జెండా రంగుల్లో,విద్యుత్ దీపకాంతుల్లో రాష్ట్ర సచివాలయం వెలుగులీనింది.

## గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాద మృతుల్లో 10 మంది ఉప్పర్ పల్లి భరత్ నగర్ వాసులే..

**మృతుల కుటుంబాలను పరామర్శించిన హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి,లు**




**రాజేంద్రనగర్,మే18(సూర్యరేఖ)** గుల్జార్ హౌస్ కృష్ణాపెరల్స్ లో అగ్ని ప్రమాదం సంభవించి దుర్మరణం చెందిన 17 మంది రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్ పల్లి భరత్ నగర్ నివాసులని తెలిసింది.అగ్నిప్రమాదంలో మృతి చెందిన 10 మంది మృతదేహాలను ఆదివారం మధ్యాహ్నం భరత్ నగర్ కు తీసుకువచ్చారు.ఒక కుటుంబంలో మొత్తం సభ్యులు మరణించగా,మరో కుటుంబంలో నలుగురు మృతి చెందినట్లు తెలిసింది. మృతుల కుటుంబాలను హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి,సి.నారాయణరెడ్డి,లు పరమార్శించారు.మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా రావడం,పోలీసులు సరిగా స్పందించకపోవడం లాంటి విషయాలపై సమగ్రంగా దర్యాప్తు చేస్తామని తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్ పల్లి భరత్ నగర్ కు తీసుకు వచ్చిన మృతదేహాలలో ప్రహ్లాద్ మోడీ (70),మున్నీ మోడీ (70),వర్షామోడీ (35),రాజేందర్ మోడీ (65),ఇరాజ్ మోడీ (2), అభిషేక్ మోడీ (31),సుమిత్ర మోడీ (60),హామీ (7), అనుయాన్ మోడీ (3),ఇద్దు మోడీ (4)లు ఉన్నారు.

## ప్రజల తరపున ప్రభుత్వాన్ని వెంటాడుతాం.. వేటాడుతాం : దాస్యం వినయ్ భాస్కర్

**వరంగల్ :** ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ఈ రాష్ట్ర ప్రజల తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతాం.. వేటాడుతామని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి, కార్యాలయాల జోలికి వచ్చినా ఖబడ్దార్ అని హెచ్చరించారు. %గ్రేటర్ వరంగల్ పరిధిలోని 29వ డివిజన్ రామన్నపేటలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ యూత్ కార్యాలయాన్ని ఆయన ఆదివారం రోజున ప్రారంభించారు. ఈ సందర్భంగా రామన్నపేటకు చెందిన వివిధ పార్టీలకు చెందిన 100 మంది యువకులు, మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి దాస్యం వినయ్ భాస్కర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

%ఋుంఋుఎ1

%ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టించినా.. తమ కార్యకర్తలను బెదిరింపులకు గురిచేసే స్థానిక కాంగ్రెస్ నాయకులకు ఒకటే చెబుతున్నాను. రానున్న రోజుల్లో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. అప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. 29వ డివిజన్ ప్రజల ఓట్లతో గెలిచి%ఔ% ఇక్కడి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన వారికి రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుదాం%ఔ% 2 సార్లు వారికి రాజకీయ భిక్ష పెట్టింది ఇక్కడి ప్రజలే. రానున్న రోజుల్లో ఇక్కడి ప్రజల అభీష్టం మేరకు పని చేసే వారికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇస్తుంది. 29వ డివిజన్‌లో గత ప్రభుత్వ హయాంలో 27 కోట్ల నిధులతో 344 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. 1200 పైగా పెన్షన్లు అందించడం జరిగింది. 500 మంది ఆడపిల్లలకు కల్యాణ లక్ష్మి ద్వారా రూ.1, 00, 016 చొప్పున అందించడం జరిగింది. దాదాపు 50 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించడం జరిగింది అని వినయ్ భాస్కర్ గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో ప్రజల ఆకాంక్ష మేరకు పని చేశా. తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో కొట్లాడాను. ఆ తరువాత క్రమంలో ఎమ్మెల్యేగా, పార్లమెంట్ సెక్రటరీగా, ప్రభుత్వ చీఫ్ విప్‌గా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలకు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అందే విధంగా కృషి చేశాను. ఎన్నికల్లో ఓడినా నేటికి సైతం ప్రజల కోసం%ఔ% ప్రజలు తరపున పోరాడుతున్న. తెలంగాణ ప్రజల పక్షాన కేసీఆర్, కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ పోరాడుతోంది అని వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, ఆరు గ్యారెంటీలు ఇచ్చి .. వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది.**

16 నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలను మోసం చేసింది. బీఆర్ఎస్ పార్టీని ఆదరిస్తున్న ప్రజలను బెదిరించాలని చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ము ధైర్యం ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలి.

# బుద్ధవనం.. అసంపూర్ణం!

నల్లగొండ

ప్రపంత ప్రసిద్ధ బౌద్ధ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నాగార్జునసాగర్ వద్ద చేపట్టిన బుద్ధవనం ప్రాజెక్టు అసంపూర్ణంగా మిగిలింది. రెండు దశాబ్దాల క్రితం పునాదిరాయి వేసిన ఈ పథకం కిం ద ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాలు, పనులతో పర్యాటక సందడి కనిపిస్తున్నా, ఇంకా కీలకమైన పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. నిధుల కొరతతో పాటు అంతర్జాతీయ బౌద్ధ సమాజం నుంచి అవసరమైన మేర మద్దతు, తో డ్పాడును కూడగట్టలేకపోవడంతో పెండింగ్ పనులకు మోక్షం కలగడం లేదు. బుద్ధు ని పుట్టుక నుంచి నిర్యాణం వరకు ప్రతీ ఘట్టాన్ని తెలియజేసేలా సాగర్‌లో స్మారక నిర్మాణాలు చేపట్టాలి. వనాలు నిర్మించడంతోపాటు బుద్ధిజం విశేషాలను తెలియజేసేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేసేందుకు చొరవ తీసుకోవాలనిపలువురు బుద్ధిస్టులు కోరుతున్నారు.



**కీలక నిర్మాణాలకు ముందుకు పడని అడుగు**

ప్రపంచ ప్రసిద్ధ క్షేత్రంగా రూపొందించాలని భావిస్తున్న బుద్ధవనంలో బౌద్ధ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, ఇందుకోసం సాగర్ రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌ను ఆనుకుని ఉన్న సుమారు వంద ఎకరాల వరకు భూమిని ఇవ్వాలని నిర్ణయించారు. బౌద్ధ ప్రత్యేకతలు, ఆయుర్వేదం, కళలు, సంస్కృతి తదితర అన్ని అంశాలను ఇక్కడ బోధించాలని, అందుకు అవసరమైన రీతిలో యూనివర్సిటీని ప్రపంచ బౌద్ధ సంస్థలతో కలిసి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయి తే ఇప్పటివరకు పలు దేశాలకు చె ందిన బుద్ధిస్టులు ఇక్కడ కు వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప యూనివర్సిటీ ఏర్పాటులో కదలిక రాలేదు. రాష్ట్ర ప్రభుత్వమే ఇందుకోసం ప్రత్యేకంగా చర్యలు చేపడితే తప్ప యూనివర్సిటీ ఏర్పాటుకు ముందడుగు పడదని స్పష్టమవుతోంది. అదేవిధంగా ఇక్కడ నిర్మించతలపెట్టిన ఆసుపత్రి, త్రీస్టార్ హెూటల్ తదితర నిర్మాణాలకు కూడా ఇంకా ఎలాంటి ప్రతిపాదనలు సిద్ధం కాలేదు. ప్రధానంగా ఇక్కడ ప్రస్తుతం ఆరు కాటేజీలు మాత్రమే ఉం డటంతో ఇక్కడకు వచ్చే పర్యాటకులకు ఉండటానికి సరైన వసతి సదుపాయాలు లేని పరిస్థితి కొనసాగుతోంది. ఇక్కడ త్రీస్టార్ హెూటల్ నిర్మిస్తే బౌద్ధ పర్యాటకులకు అనువుగా ఉంటుందనే సూచనలు వస్తున్నాయి. ఇందుకోసం ఇక్కడ 15 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించారు. రామచంద్రమిషన్ తరుపున ఈ హెూటల్ నిర్మించడానికి కసరత్తు జరిగినా కార్యాచరణ అమలులోకి రాలేదు. బుద్ధవనం ప్రాజెక్టు వద్ద ప్రధాన రోడ్డుకు ఆనుకుని 16 దుకాణాలతో రూ.1.60 కోట్లతో నిర్మిస్తోన్న దుకాణ సముదాయం కూడా అసంపూర్తిగానే నిలిచింది. కాంట్రాక్టర్‌కు బిల్లులు పెండింగ్ ఉండటంతో పనులు ఆగినట్లు చెబుతున్నారు. బుద్ధవనంలో పైన పేర్కొన్న కీలకమైన పనులకు ప్రభుత్వం చొరవ తీసుకుని నిధులతో పాటు, ఆయా సంస్థలు వచ్చేలా కృషి చేస్తే బుద్ధవనం ఏర్పాటు లక్ష్యం నెరవేరుతుందనే అభిప్రాయాన్ని పలువురు బుద్ధిస్టులు వ్యక్తం చేశారు.

**ఇతర దేశాలకు భూములు కేటాయించినా ..**

బౌద్ధమతం అవలంబించే శ్రీలంక, టిబెట్, అమెరికా, నేపాల్ తదితర దేశాలకు ఇక్కడ అయిదేసి ఎకరాల చొప్పున భూమి కేటాయించారు. ఆయా దేశాల బౌద్ధ సంస్థలు, పర్యాటక సంస్థలు తమ దేశాల్లోని బౌద్ధం విశేషాలను, ప్రత్యేకతలను ప్రతిబింబించే నిర్మాణాలు చేపట్టడం ద్వారా ఈ క్షేత్రానికి అంతర్జాతీయ ప్రాధాన్యం వస్తుందని భావించారు. ఆయాదేశాల ప్రతినిధులు ఈ ప్రాంతాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేసినా తమ తరుపున ఇక్కడ నిర్మాణాలేవీ ఇంతవరకు చేపట్టలేదు. ఇందుకోసం ఆయా సంస్థలు, దేశాల ప్రతినిధులను ఇక్కడికి రప్పించేందుకు అవసరమైన చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉంది. వారితో సంప్రదింపులు జరపాల్సి ఉందని ఈ ప్రక్రియను తక్షణం చేపట్టి ముందుకెళితేనే ఆయా దేశాల తరుపున ఇక్కడ నిర్మాణాలు చేపడతారని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాల్సి ఉందని చెబుతున్నారు.

**ప్రశాంతతకు నెలవుగా బుద్ధవనం..**

నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టును ఆనుకుని 270 ఎకరాల్లో నిర్మించ తలపెట్టిన బుద్ధవనం ప్రాజెక్టు ప్రశాంతతకు కేంద్రంగా మారనుంది. బుద్ధుని జననం నుంచి నిర్యాణం వరకు ప్రతీ ఘట్టాన్ని ఇక్కడ వనాల రూపంలో, స్మారక స్థూపాల రూపంలో, నిర్మాణాల రూపంలో ఏర్పాటు చేస్తున్నారు. 2016లో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు ఎంట్రన్స్ ప్లాజా, ఫుడ్ కోర్టులు, ఆరు కాటేజీలు, బుద్ధ జీవితవనం, జాతకవనం, ధ్యానవనం, స్థూపవనం, మహాస్థూపం నిర్మాణాలు పూర్తయ్యాయి. 21మీటర్ల ఎత్తు, 42మీటర్ల వ్యాసంతో మహాస్థూపాన్ని నిర్మించారు. బుద్ధుని అష్టాంగమార్గాలకు గుర్తుగా దీంట్లో ఎనిమిది భాగాలు ఏర్పాటు చేశారు. ఇందులోనే మ్యూజియం, ఆడిటోరియం, లైబ్రరీ ఉన్నాయి. స్థూపం డ్రమ్, డోమ్ భాగాలపై క్లిష్టమైన శిల్పాలు చెక్కారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఉండే 13 రకాల బౌద్ధ స్థూపాలను ఇక్కడ కూడా ఏర్పాటు చేశారు. వీటికోసం దాదాపుగా రూ.85 కోట్ల నిధులు వెచ్చించారు. ప్రస్తుతం రూ.25కోట్ల అంచనావ్యయంతో డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో డిజిటల్ లైబ్రరీ, మ్యూజియం ఏర్పాటు చేస్తారు. బుద్ధునికి సంబంధించిన 2500 పైచిలుకు జీవిత చిత్రాలను డిజిటలైజ్ చేసి ఇక్కడ పర్యాటకులకు ప్రదర్శిస్తారు. ప్రస్తుతం నిర్మించిన వనాలు, స్థూపాలు, మహాస్థూపంతో పర్యాటకులు వస్తున్నా ఇంకా కీలకమైన నిర్మాణాలు జరగకపోవడం, వచ్చే పర్యాటకులు ఉండేందుకు అవసరమైన వనరులు, సదుపాయాల కల్పనకు శాశ్వత ఏర్పాట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ఇక్కడ పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని, ప్రత్యేకదృష్టితో ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని బుద్ధిస్టులు పలువురు తెలిపారు



# జుట్టు తెల్లబడి ఇబ్బంది పడుతున్నారా..

## ఈ చిట్కాలను పాటిస్తే సహజసిద్ధంగానే జుట్టు నల్లగా మారుతుంది..

ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వారికి మాత్రమే జుట్టు తెల్లగా అయ్యేది. కానీ ప్రస్తుతం చిన్న వయస్సులో ఉన్నవారు కూడా జుట్టు తెల్లబడే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. పోషకాహార లోపం, ఒత్తిడి, దీర్ఘకాలిక వ్యాధులు ఉండడం, ఆందోళన, కాలుష్యం, తగినన్ని నీళ్లను తాగకపోవడం, నిద్ర సరిగ్గా లేకపోవడం వంటి అనేక కారణాల వల్ల జుట్టు తెల్లబడే సమస్యను చిన్న వయస్సులోనే ఎదుర్కొంటున్నారు. అయితే ఇందుకు ఖరీదైన చికిత్సలు చేయించాల్సిన పనిలేదు. పలు చిట్కాలను పాటిస్తే చాలు.. తెల్లబడ్డ జుట్టును సహజసిద్ధంగా నల్లగా మార్చుకోవచ్చు. దీంతోపాటు శిరోజాలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ఒత్తుగా పెరుగుతాయి. చుండ్రు నుంచి సైతం విముక్తి లభిస్తుంది.

**ఉసిరి ముక్కలతో..**

కొన్ని ఎండిన ఉసిరి ముక్కలను తీసుకుని ఒక కడాయిలో వేయాలి. అందులోనే కాస్త కొబ్బరినూనె లేదా నువ్వుల నూనెను ముక్కలు మునిగే వరకు పోయాలి. తరువాత వాటిని బాగా మరిగించాలి. దీంతో కాసేపటికి నూనె నల్లగా మారుతుంది. తరువాత స్టవ్ ఆఫ్ చేసి ఆ నూనెను వడబోసి సీసాలో నిల్వ చేయాలి. దీన్ని జుట్టుకు రాసి 2 గంటలు అయ్యాక తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తుంటే శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరగడమే కాదు, తెల్లగా ఉన్న జుట్టు సహజసిద్ధంగా నల్లగా మారుతుంది. అలాగే ఉసిరిక పొడిలో హెన్నా పొడి, పెరుగు కలిపి మిశ్రమంగా చేసి దీన్ని జుట్టుకు రాసి కాసేపు అయ్యాక తలస్నానం చేయాలి. ఇలా చేస్తున్నా కూడా సమస్య తగ్గుతుంది.

### బ్లాక్ టీ లేదా కాఫీ..

బ్లాక్ టీని తయారు చేసి దాన్ని జుట్టుకు బాగా మర్దనా చేయాలి. గంట సేపు అయ్యాక కడిగేయాలి. ఇలా తరచూ చేస్తున్నా కూడా తెల్ల జుట్టును నల్లగా మార్చుకోవచ్చు. అలాగే బ్లాక్ కాఫీ కూడా బాగానే పనిచేస్తుంది. దీన్ని కూడా జుట్టుకు పట్టించి 20 నిమిషాలు అయ్యాక తలస్నానం చేయాలి. దీంతో కూడా శిరోజాలు సహజసిద్ధంగా నల్లగా మారుతాయి. ఒక కడాయిలో కొబ్బరినూనెను వేసి అందులో కొన్ని కరివేపాకులను మునిగేలా వేసి మరిగించాలి. ఆకులు నల్లబడ్డాక స్టవ్ ఆఫ్ చేసి మిశ్రమాన్ని చల్లార్చాలి. అనంతరం దీన్ని వడకట్టి ఒక సీసాలో నిల్వ చేయాలి. దీన్ని జుట్టుకు రాత్రి పూట మసాజ్ చేసి మరుసటి రోజు ఉదయం తలస్నానం చేయాలి. ఇలా చేస్తుంటే తప్పక ఫలితం కనిపిస్తుంది.

### ఉల్లిపాయ రసం..

ఉల్లిపాయల నుంచి జ్యూస్‌ను తీయాలి. దీన్ని జుట్టుకు నేరుగా మర్దనా చేయాలి. 60 నిమిషాలు అయ్యాక తలస్నానం చేయాలి. అవసరం అయితే కాస్త పెరుగు లేదా నిమ్మరసం కలుపుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని తరచూ రాస్తుంటే చుండ్రు తగ్గుతుంది. శిరోజాలు నల్లగా మారుతాయి. బీరకాయలను చిన్న ముక్కలుగా కట్ చేసి ఎండలో ఎండబెట్టాలి. అనంతరం వాటిని కొబ్బరినూనెలో వేసి నల్లగా అయ్యే వరకు మరిగించాలి. తరువాత ఆ నూనెను సేకరించి నిల్వ చేసుకోవాలి. ఈ నూనెను తరచూ రాస్తుంటే తెల్లబడ్డ జుట్టు మళ్లీ నల్లగా మారుతుంది. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా మారుతాయి. కాంతివంతంగా తయారవుతాయి. ఇలా పలు చిట్కాలను పాటించడం వల్ల శిరోజాలను నల్లగా మార్చుకోవడమే కాక జుట్టును ఒత్తుగా, దృఢంగా పెరిగేలా చేయవచ్చు.

# డయాబెటిస్ ఉన్నవారికి వరం ఈ ఆకులు..



పొడపత్రి ఆకు.. దీన్నే కేరళ జిన్సెంగ్ అని, బ్రహ్మ మూలిక అని కూడా పిలుస్తారు. ఈ మొక్క మన దేశంలోని పశ్చిమ కనుమల్లో ఎక్కువగా పెరుగుతుంది. కేరళలో ఈ మొక్కలు మనకు ఎక్కడ చూసినా కనిపిస్తాయి. ఆయుర్వేదంలో ఈ మొక్క ఆకులను ఎంతో పురాతన కాలం నుంచే ఉపయోగిస్తున్నారు. ఈ మొక్క ఆకులు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. పొడపత్రి ఆకులను నేరుగా తినవచ్చు. లేదా రసం చేసి కొద్ది మొత్తాల్లో తాగవచ్చు. పొడ పత్రి ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. అలసట, నీరసం తగ్గుతాయి. ఒత్తిడి, ఆందోళ నుంచి ఉపశమనం లభిస్తుంది. పొడపత్రి ఆకులను తీసుకోవడం వల్ల పురుషుల్లో శృంగార సామర్థ్యం పెరుగుతుంది. శృంగారంలో చురుగ్గా పాల్గొంటారు. ఇందుకు గాను ఆకులను రాత్రి పూట తినాల్సి ఉంటుంది.

**ఆర్థరైటిస్ నొప్పులకు..**

పొడపత్రి ఆకుల్లో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు సమృద్ధిగా ఉన్నాయి. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం ఈ ఆకులను తినడం వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా తగ్గిపోతాయి. పొడపత్రి ఆకుల్లో బయో యాక్టివ్ సమ్మేళనాలు అధికంగా ఉన్నాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగా పనిచేస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించడంతోపాటు కణాలను రక్షిస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. పొడపత్రి ఆకుల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో తేలింది. అందువల్ల ఈ ఆకులను తింటే వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.


**డయాబెటిస్ సమస్యకు..**

పొడపత్రి ఆకుల్లో యాంటీ ఫాటిగ్ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఈ ఆకులను తింటే ఎంతటి నీరసం, అలసట అయినా త్వరగా తగ్గిపోతాయి. మళ్లీ చురుగ్గా మారుతారు. ఉత్సాహంగా పనిచేస్తారు. యాక్టివ్‌గా ఉంటారు. పొడపత్రి ఆకుల్లో న్యూరో ప్రొటెక్టివ్ గుణాలు ఉంటాయి. కనుక ఈ ఆకులను తింటే నరాల బలహీనత తగ్గుతుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. పొడపత్రి ఆకులను షుగర్ ఉన్నవారికి వరంగా చెప్పవచ్చు. ఈ ఆకులను తింటే షుగర్ లెవల్స్ క్రమంగా తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఈ ఆకులను తిన డం వల్ల పిండి పదార్థాలు నెమ్మదిగా రక్తంలో కలుస్తాయి. దీంతో షుగర్‌ను ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవచ్చు.

**జాగ్రత్త అవసరం..**

పొడపత్రి ఆకులను నేరుగా తినవచ్చు. లేదా రసం తీసి తాగవచ్చు. కానీ స్వల్ప మొత్తాల్లో తీసుకోవాల్సి ఉంటుంది. ఇది వ్యక్తి శరీర తత్వం, ఉన్న వ్యాధిని బట్టి మారుతుంది. కనుక ఈ ఆకులను వాడాలనుకుంటే ఆయుర్వేద వైద్యుల సలహా తీసుకోవాలి. ఒకటి లేదా రెండు ఆకులను తినడం, ఒక టీస్పూన్ రసం సేవించడం సురక్షితంగా భావిస్తారు. పలు రకాల ఆయుర్వేద ఔషధాల తయారీలోనూ పొడపత్రి ఆకులను విరివిగా ఉపయోగిస్తారు. రాత్రి పూట పొడపత్రి ఆకులను పాలతో తీసుకుంటే పురుషులకు మేలు జరుగుతుంది. గాయాలు, పుండ్లు, చర్మ సమస్యలను తగ్గించేందుకు కూడా ఈ ఆకులను ఉపయోగించవచ్చు. కొద్దిగా పేస్ట్‌లా చేసి ఈ ఆకులను రాస్తుంటే గాయాలు, పుండ్లు త్వరగా తగ్గుతాయి. అయితే అలర్జీలు ఉన్నవారు ఈ ఆకులను వాడకూడదు.

# హైబీపీని అదుపులో ఉంచుకుందాం ఇలా!



హైబీపీ అనేది జీవనశైలికి సంబంధించిన ఓ ఆరోగ్య సమస్య. ఇది ఒకసారి కనిపించాక ఇక దాదాపు బాధితుల జీవితకాలమంతా హైబీపీ వాళ్ల జీవనాన్నీ, అలవాట్లను ప్రభావితం చేస్తుంది. సాధారణంగా నార్మల్‌గా 120 / 80 ఉండాల్సిన బీపీ కొలత అంతకంటే ఎక్కువగా ఉండటాన్ని హైబీపీ లేదా హైపర్‌టెన్షన్‌గా చెబుతారు. హైబీపీ ప్రధానంగా జన్యు కారణాల వల్లనే వస్తుంది. అయితే వాళ్ల జీవ నశైలిలో భాగంగా వాళ్లు తీసుకునే ఆహారం, దేహానికి దొరికే వ్యాయామం అలాగే వాళ్లు అనుభవించే ఒత్తిడి... ఇవన్నీ హైబీపీ వచ్చేందుకు కారణమవుతుంటాయి.

నివారణ ఇలా...

ఆరోగ్యకరమైన జీవనశైలితో హైబీపీని చాలావరకు నివారించవచ్చు. అదెలాగో చూద్దాం. ఆహారంలో సోడియమ్ మోతాదులు ఎక్కువగా తీసుకోవడం నేరుగా బీపీని పెంచుతుంది. అందుకే ఉప్పు ఎక్కువగా ఉండే ప్రాసెస్‌డ్ ఆహారాలు, క్యాన్‌డ్ ఫుడ్స్, ఉప్పు ఎక్కువగా ఉండే శ్నాక్స్ వంటివి తగ్గించాలి. పొటాషియమ్ ఉండే ఆహారాలతో బీపీ నియంత్రణలో ఉంటుంది. అందుకే పొటాషియమ్ మోతాదులు ఎక్కువగా ఉండే అరటిపండ్లు, చిలగడదుంపలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. ఆహారంతో హైబీపీని నియంత్రించడాన్ని 'డయటరీ అప్రోచ్ టు స్టాప్ హైపర్‌టెన్షన్'గా చెబుతారు. ఇందులోని మొదటి అక్షరాలను తీసుకుని సంక్షిప్తంగా ఈ పద్ధతిని 'డ్యాష్'గా పేర్కొంటారు. డ్యాష్ ఆహారాల్లో భాగంగా తాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు, కొవ్వు తక్కువగా ఉండే ప్రోటీన్‌లతో హైబీపీని నియంత్రించవచ్చు.

**వ్యాయామం ఇలా...**

ప్రతివారం కనీసం 150 నిమిషాలకు తగ్గకుండా ఏదో ఒక వ్యాయామం చేస్తుండటం మంచిది. దీర్ఘకాలిక ఒత్తిడి హైబీపీకి కారణమవుతుంది. అందుకే ఒత్తిడిని అదుపు చేసేందుకు యోగా, ధ్యానం, శ్వాసవ్యాయామాల వంటి ప్రక్రియలు అనుసరించడం మేలు. మద్యం, పొగతాగే అలవాట్లు హైబీపీని మరింత ప్రేరేపిస్తాయి. అందుకే ఆ అలవాట్లకు దూరంగా ఉండటం మంచిది. అంతేకాదు... పొగతాగని వారితో పోలిస్తే పొగతాగేవా రిలో... రక్తనాళాల్ని పెళుసుగా మార్చే 'అథెరోస్క్లెరోసిస్' అనే సమస్య 10 ఏళ్ల ముందుగా వస్తుందని అనేక అధ్యయనాల్లో తేలింది.

**మరికొన్ని ఇతర సూచనలు...**

స్థూలకాయం ఉన్నవారు బరువు తగ్గించుకోవాలి. దాంతో బీపీ ముప్పు గణనీయంగా తగ్గుతుంది. రోజూ కనీసం 7 -9 గంటలు కంటినిండా నిద్రపోవాలి. ఇక క్రమం తప్ప కుండా బీపీ పరీక్షించుకుంటూ ఉంటూ దాన్ని బట్టి జీవన శైలిలో మార్పులు చేసుకుంటూ ఉండాలి. హైబీపీ ఉన్నవా రు క్రమం తప్పకుండా డాక్టర్ సూచించిన మోతాదులో మందులు తీసుకుంటూ ఉండాలి. డాక్టర్‌కు చెప్పకుండా మానేయడం సరికాదు. చివరగా... బీపీ రీడింగ్‌ను క్రమం తప్పకుండా ఖచ్చితమైన రీతిలో చూసుకుంటూ, దాన్ని అదుపులో ఉంచుకోవడం ద్వారా సుదీర్ఘకాలం పాటు మామూలుగానే జీవించడం సాధ్యమవుతుంది.

# ప్లీజ్..నో సప్లిమెంట్స్..! మై ప్లేట్ ఫర్ ది డే మెనూ..



మీకు విటమిన్ ఇ లోపం ఉంది.. మీకు ప్రోటీన్స్ సరిపోవడం లేదు.. ఈ సప్లిమెంట్స్ తీసుకోండి.. అంటూ సూచించే వైద్యులు, పోషకాహార నిపుణులతో పాటు వాటిని వినియోగించే నగరవాసులూ పెరిగిపోయారు. ఈ నేపథ్యంలో సప్లిమెంట్స్‌ను అతిగా వినియోగించవద్దని హైదరాబాద్ నగరానికి చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్) ఇటీవల నిర్వహించిన ఓ పరిశోధన ఫలితం ఆధారంగా సూచిస్తోంది. అధిక సప్లిమెంట్స్ వాడకం హానికరం అంటున్న ఎన్ఐఎన్.. దానికి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా సూచిస్తోంది. బలవర్థకమైన ఆహారాల నుంచి దొరకని పోషకాలను సప్లిమెంట్లు/మాత్రలు/క్యాప్సూల్స్ అందిస్తాయి అనేది నిజమే అయినా కొన్ని పోషకాలను సప్లిమెంట్‌లుగా తీసుకోవడం వల్ల ఇతర పోషకాల సహజ శోషణకు ఆటంకం కలుగుతుందని ఎన్ఐఎన్ హెచ్చరిస్తోంది. రోజువారీ పోషకాహార అవసరాలను తీర్చడానికి సప్లిమెంట్లపై అధికంగా ఆధారపడటం ఆరోగ్యానికి హానికరం అని స్పష్టం చేస్తోంది. తాము సూచించిన 'మై ప్లేట్ ఫర్ ది డే'లో సూచించిన సమతుల ఆహారం ద్వారా అందేవి మరే ఏ విటమిన్ లేదా మినరల్ సప్లిమెంట్లు అందించలేవని స్పష్టం చేస్తోంది.

**'మై ప్లేట్ ఫర్ ది డే'**

మన రోజువారీ అవసరాలకు అనుగుణంగా అన్ని పోషకాలు మన శరీరానికి అందేందుకు మై ప్లేట్ ఫర్ ది డే అనే ఆసక్తికరమైన మెనూను ఎన్ఐఎన్ రూపొందించింది. ఇది మన ఆహారంలో అవసరమైన పోషకాహార స్పష్టతను అందిస్తుంది. రోజువారీ ఆహారం కోసం వివిధ ఆహార సమూహాల ఖచ్చితమైన నిష్పత్తులను అర్థం చేసుకోవడానికి ఇది మార్గనిర్దేశం చేస్తుంది. ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులను ప్రోత్సహించడానికి 'భారతీయుల పోషక అవసరాలు' ఆధారంగా దీన్ని డిజైన్ చేశారు.

**రోజుకు 2వేల కేలరీలు.. అదే ఆరోగ్యానికి మేలు**

వ్యక్తులు(చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాల ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కాకుండా) తమ పోషక అవసరాలను తీర్చుకునేందుకు రోజుకి 2 వేల కిలో కేలరీలు/ఆహారాన్ని తీసుకోవాల్సి ఉంటుందని 'మై ప్లేట్ ఫర్ ది డే' చెబుతోంది. అయితే ఇది కేవలం కేలరీలు అందించే ఆహారం మాత్రమే కాకూడదని, దీనిలో శరీరానికి అవసరమైన అమైనో ఆమ్లాలు, కొవ్వు ఆమ్లాలు, ఖనిజాలు, ప్రొటీన్లు, విటమిన్లు ఇతర బయోయాక్టివ్ సమ్మేళనాలు.. ఇలా ఆరోగ్యపరమైన అవసరాలను తీర్చడానికి సరైన నిష్పత్తిలో ఉండాలని సూచిస్తోంది.

**రోజుకి 2వేల కిలో కేలరీల ఆహారం కోసం..**

కూరగాయలు ఆకు కూరలు: 400 గ్రాములు(ముడి బరువు),
మిల్లెట్లతో సహా తృణధాన్యాలు: 260 గ్రాములు,
పండ్లు: 100 గ్రాములు,
పప్పులు/గుడ్లు/మాంసపు ఆహారాలు: 85 గ్రాములు,
గింజలు విత్తనాలు: 30 గ్రాములు,
కొవ్వులు నూనె: 27 గ్రాములు,
పాలు/పెరుగు: 300 మి.లీ.

**స్నాక్స్.. ఆరోగ్యకరంగా..**

అవసరమైన కేలరీలకు మించకుండా స్నాక్స్ తినడం వల్ల నష్టం లేదు. కొన్ని రకాల స్నాక్స్ బరువు తగ్గడానికి సహకరిస్తుంది అంటున్నారు పోషకాహార నిపుణులు డాక్టర్ రోహిణి పాటిల్. స్నాక్స్‌గా ఆయన గుప్పెడు కాలిఫోర్నియా ఆల్మండ్స్ సూచిస్తున్నారు. ఈ బాదంలో ప్రోటీన్, మెగ్నీషియం, విటమిన్ ఇ జింక్ వంటి 15 ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. గుండె ఆరోగ్యం, చర్మ ఆరోగ్యం, బరువు నిర్వహణకు ఇవి బెస్ట్, అలాగే నూనె లేకుండా వండిన మూంగ్ దాల్ చిల్లా బరువు తగ్గడానికి అనుకూలమైన మరొక చిరుతిండి. మూంగ్ దాల్(పెసర పప్పు)లో పొటాషీయం, మెగ్నీషియం, ఇనుము, రాగి పుష్కలంగా ఉంటాయి. జీర్ణక్రియ, గుండె ఆరోగ్యం రెండింటికీ మంచిది. పెసర శనగల మొలకలతో తయారైన భేల్‌లో రుచికరమైన స్నాక్. దోసకాయ, టమోటాలు, పచ్చి మామిడి, నిమ్మరసంతో కలిపిన మొలకలు, భేల్ ఫైబర్, విటమిన్లు, ఖనిజాలను అందిస్తుంది.

### శోషించే ఆహారమే.. మేలు

ఆరోగ్యకరమైన సహజ ఆహారాలను శరీరం బాగా గ్రహిస్తుంది. అంతేకాకుండా అవి ఎక్కువ జీవ లభ్యతను కలిగి ఉంటాయి. విటమిన్లు ఖనిజాల తీవ్రమైన కొరతతో బాధపడుతున్న వ్యక్తుల కోసం, అన్ని సూక్ష్మపోషకాలు, బయోయాక్టివ్ సమ్మేళనాలు, ఫంక్షనల్ ఫుడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు మొదలైన వాటిని తగినంతగా తీసుకోవడం మంచిదని ఎన్ఐఎన్ సూచిస్తోంది. ఈ నేపథ్యంలో అన్ని పోషకాలతో కూడిన 'మై ప్లేట్ ఫర్ ది డే' ఎలా ఉండాలో డిజైన్ చేసి అందిస్తోంది.

## బిజినెస్

# టాటా ఏస్‌లో కూడా ఈవీ వెర్షన్.. మార్చుకోవడం చాలా సింపుల్

ఇటీవల కాలంలో గ్రామీణ ప్రాంత యువత కొంత మంది వస్తు రవాణాకు అనుగుణంగా ఉండే టాటా ఏస్ వాహనాలను కొనుగోలు చేసి వాటి ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. అయితే వారికి టాటా ఏస్ నిర్వహణ ఖర్చు ముఖ్యంగా డీజిల్ ఖర్చు అధికంగా ఉంటుంది. ఈ ఖర్చును తగ్గించుకునేలా ఓ కంపెనీ ఈవీ కిట్‌ను విడుదల చేశారు. సాంప్రదాయ ఐసీఈ ఇంజిన్ నుంచి ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడానికి రూపొందించిన రెట్రోఫిట్ కిట్‌ను సన్ మొబిలిటీ బ్లూవీల్ భాగస్వామ్యంతో విడుదల చేసింది. ఈ కొత్త ఈవీల భారీ ధర లేకుండా ఫ్లీట్ ఆపరేటర్లు ఎలక్ట్రిక్ మొబిలిటీకి మారడాన్ని సులభతరం చేస్తుందని ఆ కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. సన్ మొబిలిటీకు సంబంధించిన బ్యాటరీ స్వాపింగ్ టెక్నాల జీని సమగ్రపరచడం ద్వారా ఈ కిట్లు టాటా ఏస్ వాహనాలను మార్చుకోదగిన బ్యాటరీలతో ఎలక్ట్రిక్ యూనిట్లుగా పనిచేయడానికి వీలు కల్పిస్తాయి. తద్వారా గణనీయమైన ఖర్చు ఆదాతో పాటు కార్యాచరణ ప్రయోజనాలను పొందవచ్చు. రెట్రోఫిట్ కిట్లు మొదట ఎన్‌సీఆర్ ప్రాంతంలో అందుబాటులో ఉంటాయి. భవిష్యత్‌లో ఇతర రాష్ట్రాలకు విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఈవీ రెట్రోఫిట్టింగ్ అంటే పెట్రోల్, డీజిల్ లేదా సీఎన్‌జీ వాహనాన్ని ఎలక్ట్రిక్ వాహనంగా మార్చే ప్రక్రియ. అంతర్గత దహన యంత్రాన్ని ఎలక్ట్రిక్ మోటారుతో భర్తీ చేసి బ్యాటరీ ప్యాక్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. ఈ మార్పిడిలో వాహన అసలు నిర్మాణం, డిజైన్‌ను అలానే ఉంచుతూ మోటారు, బ్యాటరీ, తరచుగా కొత్త నియంత్రణ వ్యవస్థ వంటి కొత్త



భాగాలను అమరుస్తారు. ఈ విధానం బ్రాండ్-న్యూ ఈవీని కొనుగోలు చేయకుండా ఎలక్ట్రిక్ మొబిలిటీకి మారడానికి ఖర్చుతో కూడుకున్న మార్గాన్ని అందిస్తుంది. సీఎన్‌జీ వాహనాల నుండి మారుతున్న ఫ్లీట్ ఆపరేటర్లు నెలవారీ ఖర్చులో దాదాపు 30 శాతం తగ్గింపును ఆశించవచ్చు. డీజిల్ నుండి మారుతున్న వారు 40 శాతం వరకు ఆదా పొందుతారు. ఈ మార్పిడి ఆర్థిక ప్రయోజనాలను అందించడమే కాకుండా ఇప్పటికే ఉన్న వాహనాల జీవితకాలాన్ని పొడిగించుకోవచ్చు. కొత్త రెట్రోఫిట్ సొల్యూషన్ ఎలక్ట్రిక్ వాహనాల స్వీకరణ వైపు ప్రభుత్వ ప్రోత్సాహానికి అనుగుణంగా ఉంటుంది. బ్రాండ్-న్యూ వాహనాల్లో పెట్టుబడి పెట్టకుండా నియంత్రణ ప్రమాణాలను పాటించడానికి టాటా ఏస్ వాహనదారులకు ఆచరణాత్మక ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది.

## 24 గంటల్లో 8000 బుకింగ్స్.. ఒకేరోజు 150 కార్ల డెలివరీ



జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇటీవల.. 'విండ్సర్ ప్రో' పేరుతో పెద్ద బ్యాటరీ ప్యాక్ కలిగిన ఎలక్ట్రిక్ కారును లాంచ్ చేసింది. మార్కెట్లో కొత్తగా విడుదలైన ఈ కారు.. కస్టమర్లను ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో కొనుగోలు చేయడానికి ఎగబడ్డారు. కంపెనీ కూడా డెలివరీలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే.. బెంగళూరులోని 150 మంది కస్టమర్లకు ఒకేసారి విండ్సర్ ప్రో డెలివరీలు చేసింది. ఈ కారు కోసం బుకింగ్స్ ప్రారంభించిన కేవలం 24 గంటల్లోనే 8,000 బుకింగ్‌లను పొందిన ఎంజీ విండ్సర్ ప్రో.. ప్రారంభ ధర రూ. 17.49 లక్షలు (ఎక్స్ షోరూమ్). ఈ కొత్త వెర్షన్ చూడటానికి దాదాపు స్టాండర్డ్ మోడల్ మాదిరిగా ఉన్నప్పటికీ.. కొన్ని సూక్ష్మమైన అప్డేట్స్ పొందింది. కొత్త అల్లాయ్ వీల్స్, టెయిల్‌గేట్‌పై ఏడీఏఎస్ బ్యాడ్జ్, లైట్ కలర్ ఇంటీరియర్ వంటివి ఇందులో కొత్త అప్డేట్స్ అని తెలుస్తోంది. సెలాడాన్ బ్లూ, అరోరా సిల్వర్, గ్లేజ్ రెడ్ వంటి కొత్త కలర్ ఆప్షన్లలో లభించే ఎంజీ విండ్సర్ ప్రో.. 52.9 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్ ద్వారా 449 కిమీ రేంజ్ అందిస్తుందని కంపెనీ ధ్రువీకరించింది. ఇప్పటికే దేశీయ మార్కెట్లో అమ్మకానికి ఉన్న 'ఎంజీ విండ్సర్' 38 కిలోవాట్ బ్యాటరీ ద్వారా 332 కిమీ రేంజ్ అందించేది. ఎక్కువ రేంజ్ కావాలని కోరుకునే వారి కోసం కంపెనీ ఇప్పుడు 52.9 కిలోవాట్ బ్యాటరీతో లాంచ్ చేసింది.

## తక్కువ ఖర్చు.. ఎక్కువ లాభం.. లక్షాధికారులను చేసే 7 వ్యాపారాలు



నేటి మహిళలు ఇంటి పని చేయడమే కాకుండా తమంతట తాముగా సంపాదించుకోవాలని కూడా కోరుకుంటారు. ఆమె తన సొంత నిర్ణయాలు తీసుకునేలా ఆర్థికంగా బలంగా ఉండాలని కోరుకుంటుంది. నేటి యుగంలో ఇంట్లో కూర్చొని కూడా అనేక రకాల చిన్న వ్యాపారాలను ప్రారంభించవచ్చు. అటువంటి వ్యాపారంలో ఎక్కువ డబ్బు పెట్టుబడి పెట్టవలసిన అవసరం లేదు. ఇంటి పనులతో పాటు దీన్ని సులభంగా చేయవచ్చు. వంట, కుట్టుపని, రాయడం, ఆన్‌లైన్ పని వంటి అనేక ఎంపికలు ఉన్నాయి. వీటి ద్వారా మహిళలు ఇంటి నుండి సులభంగా సంపాదించవచ్చు. ఇది వారి ఇంటి బాధ్యతలను నెరవేర్చడంతో పాటు వారి ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసుకోవడానికి వారికి అవకాశాన్ని ఇస్తుంది. ఇటువంటి వ్యాపారం ద్వారా మహిళలు డబ్బు సంపాదించడమే కాకుండా వారి నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవచ్చు. మీరు ఇంటి నుండి ప్రారంభించగల కొన్ని సులభమైన, తక్కువ ఖర్చుతో కూడిన వ్యాపారాలు ఉన్నాయి.

# కొత్త మార్కెట్‌కు తెరలేపిన ఆర్‌బీఐ నిర్ణయం

మొబైల్ వాడకం కోవిడ్-19 తరువాత భారత్‌లో గణనీయంగా పెరిగింది. డేటా ఫర్ ఇండియా 2025 ఫిబ్రవరి నివేదిక ప్రకారం.. ఈ విషయంలో 10%-%19 ఏళ్ల వయసువారు ముందంజలో ఉన్నారు. మొబైల్ వినియోగంలో నైపుణ్యత పట్టణ ధనిక వర్గం పిల్లలకే పరిమితం కాలేదు. గ్రామాల్లోనూ పెరిగింది. ఇప్పటికే మైనర్లు పరిమితులతో కూడిన మొబైల్ వాలెట్స్, పాకెట్ మనీ డిజిటల్ వాలెట్స్, యూపీఐ సర్కిల్‌ను విరివిగా వాడుతున్నారు. 10 ఏళ్లకుపైబడిన మైనర్లు వారి సేవింగ్స్, టర్మ్ డిపాజిట్ ఖాతాలను వ్యక్తిగతంగా తెరిచి, నిర్వహించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవలే అనుమతించింది. ఈ నేపథ్యంలో డిజిటల్ పేమెంట్లు మరింత ఊపందుకుంటాయని బ్యాంకింగ్ నిపుణులు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్%-%2024 (అసర్) నివేదిక ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లోని 14%-%16 ఏళ్ల వయసున్న 75 శాతంపైగా పిల్లలు డిజిటల్ హోమ్



వర్క్‌ను పూర్తి చేయడానికి స్మార్ట్‌ఫోన్లను విజయవంతంగా వినియోగిస్తున్నారు. విద్య, వినోద అంశాలతోపాటు, యూపీఐ పేమెంట్లకు కూడా స్మార్ట్ ఫోన్ల వాడకం పెరిగింది. ఇప్పుడు ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం ఈ వాస్తవిక పరిస్థితికి అద్దం పడుతోంది. అంతేకాదు డిజిటల్ పేమెంట్స్ రంగంలో కొత్త మార్కెట్‌కు తెరలేపింది. భవిష్యత్ కస్టమర్ల సంఖ్యను పెంచుకునేందుకు బ్యాంకులకు మార్గం ఏర్పడింది. మైనర్లను బ్యాంకింగ్ వైపునకు తీసుకురావడానికి ఫిన్ టెక్ కంపెనీలు, ఆర్థిక సంస్థలు పోటీపడడం ఖాయంగా కనిపిస్తోంది. తల్లిదండ్రులు/సంరక్షకుల ద్వారా మైనర్లకు బ్యాంక్ ఖాతా తెరిచే అవకాశం ఇప్పటికే ఉంది. అయితే మైనుర్లు వ్యక్తిగతంగా ఖాతాను నిర్వహించడం వల్ల గతంలో లేని పలు అదనపు ప్రయోజనాలు ఇప్పుడు ఉన్నాయి. సొంత ఖాతా ఉంటే యూపీఐ చెల్లింపులు సులభం అవుతాయి. అంతేకాదు, తరచూ చిన్నపాటి కొనుగోళ్లు జరిపే 14%-%18 ఏళ్ల పిల్లలు ఈ మార్పు వల్ల ప్రయోజనం పొందుతారు. స్కూల్ లేదా ట్యూషన్ క్లాస్ నుంచి ఇంటికి చేరేందుకు బైకులను యాప్‌ల ద్వారా బుక్ చేసుకోవడం, క్యాంటీన్‌లో ఆహారం, స్టేషనరీ కొనుక్కోవడం.. ఇలాంటి వాటికి వీలవుతుంది. దీనివల్ల మైనర్లు చేసే డిజిటల్ లావాదేవీలు మరింత పెరుగుతాయనేది సుస్పష్టం. కాగా, యువత రుణం అందుకోవడం, పెట్టుబడుల విషయంలో డిజిటల్ వేదికలు పెను మార్పులు తెచ్చాయి. చిన్నచిన్న రుణాలకు యువ కస్టమర్లు పెద్ద ఎత్తున ఫిన్ టెక్ కంపెనీలు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల తలుపు తడుతున్నారు.

## స్పోర్ట్స్

# వధేరా, శశాంక్ విధ్వంసం

ఐపీఎల్ 18వ సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న పంజాబ్ కింగ్స్ భారీ స్కోర్ చేసింది. టాపార్డర్ విఫలమైనా.. యువకెరటం నేహల్ వధేరా(70) అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు పడినా.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(30)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. డెత్ ఓవర్లలో ఆఖర్లో శశాంక్ సింగ్(59 నాటౌట్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్(21 నాటౌట్) విధ్వంసంక బ్యాటింగ్‌తో అలరించారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లను ఉతికారేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. దాంతో, పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. జైపూర్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ బౌలింగ్ ఎంచుకుంది. అయితే.. ఈసీజన్‌లో జోరు మీదున్న ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(9)ను తక్కువ స్కోర్‌కే ఔట్ చేసిన తుషార్ దేశ్‌పాండే రాజస్థాన్‌కు రెండో ఓవర్లోనే బ్రేకిచ్చాడు. కాసేపటికే ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన మిచెల్ ఓవెన్(0)ను క్వెనా మఫాకా డకౌట్ చేశాడు. అయినా సరే ప్రభ్‌సిమ్రన్ సింగ్(0) దూకుడుగా ఆడాడు. శ్రేయాస్ అయ్యర్(30) జతగా పంజాబ్ స్కోర్ బోర్డును ఉరికించాడు. అయితే.. దేశ్‌పాండే మరోసారి షాకిస్తూ ప్రభ్‌సిమ్రన్‌ను ఔట్ చేశాడు. దాంతో, పవర్ ప్లే 3.1 ఓవర్‌కే పంజాబ్ కీలకమైన 3 వికెట్లు కోల్పోయింది.

**దంచేసిన వదేరా**

దేశ్‌పాండే విజృంభణతో34కే మూడు కీలక వికెట్లు పడిన పంజాబ్‌ను అయ్యర్, నేహల్ వధేరా(70)లు ఆదుకున్నారు.



క్రీజులో కుదురుకున్నాక జోరు పెంచిన ఇద్దరూ బౌండరీలతో హడలెత్తించారు. దాంతో, 10 ఓవర్లకు పంజాబ్ స్కోర్ 97కు చేరింది. అయితే.. దంచికొడుతున్న అయ్యర్.. రియాన్ పరాగ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వత గేర్ మార్చిన వధేరా.. ఆకాశ్ మధ్వాల్ బౌలింగ్‌లో రెండో ఫోర్లతో అర్ధ శతకం సాధించాడు. ఈ సీజన్‌లో రాజస్థాన్‌పై ఈ చిచ్చరపిడుగుకు ఇది రెండో ఫిఫ్టీ. ప్రమాదకరంగా మారిన వధేరాను ఆకాశ్ ఔట్ చేయగా రాజస్థాన్ బౌలర్లు ఊపిరి పీల్చుకున్నారు. కానీ, ఆ తర్వాత అజ్మతుల్లా ఒమర్‌జాయ్(21 నాటౌట్), శశాంక్ సింగ్(59 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. మఫాకా వేసిన 18 ఓవర్లో అజ్మతుల్లా రెచ్చిపోయాడు. 4, 6, 4 బాది 16 పరుగులు పిండుకున్నాడు. అనంతరం ఆకాశ్‌కు చుక్కలు చూపిస్తూ బౌండరీ బాదాడు అజ్మతుల్లా. 20 ఓవర్లో 6, 4 తో కలిపి 17 రన్స్ రావడంతో పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 219 రన్స్ చేసింది.

## ప్లేఆఫ్స్‌పై దృష్టి.. దిల్లీ గేమ్‌ప్లాన్ ఛేంజ్.. ఓపెనర్‌గా ఆ బ్యాటర్!



ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 18వ సీజన్‌లో దిల్లీ క్యాపిటల్స్‌కు నేడు కీలకమైన మ్యాచ్. పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న గుజరాత్‌తో ఆ జట్టు ఆదివారం తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం దిల్లీకి ఎంతో అవసరం. ప్రస్తుతం ఆ జట్టు ఆరు విజయాలు.. 13 పాయింట్లతో పాయింట్స్ టేబుల్‌లో ఐదో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో ఓడితే ప్లేఆఫ్స్ అవకాశాలు మరింత సంక్లిష్టమవుతాయి. దీంతో ఆ జట్టు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మిగతా మూడు లీగ్ మ్యాచ్‌ల్లో ఆ జట్టు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఓపెనింగ్ చేయనున్నట్లు సమాచారం. ఆశించిన మేర పరుగులు రాకపోవడంతో.. బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులను ఆ జట్టు తీవ్రంగా పరిశీలిస్తోంది. ఇప్పటి వరకూ రాహుల్ ఒక్కసారి మాత్రమే ఓపెనింగ్ చేయగా.. రెండు సార్లు నంబర్ 3లో వచ్చాడు. మిగతా అన్ని మ్యాచ్‌ల్లో నంబర్ 4 లోనే బ్యాటింగ్ చేశాడు. ప్రస్తుతం ప్లేఆఫ్స్‌లో చోటు దక్కించుకోవాలంటే.. టాప్ ఆర్డర్ మెరుగ్గా రాణించాలనీ.. అందుకే కేఎల్‌ను ముందుకు పంపించాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. పవర్‌ప్లే అవకాశాలను అతడు చక్కగా ఉపయోగించుకుంటాడని చెబుతున్నారు. మరోవైపు దిల్లీ ఇటీవల మ్యాచ్‌ల్లో పేలవ ప్రదర్శనలతో నిరాశపరుస్తోంది. సన్‌రైజర్స్‌తో వర్షం కారణంగా రద్దయిన మ్యాచ్‌లో.. దిల్లీ టాప్, మిడిలార్డర్ కుదేలైంది. ఇక ధర్మశాలలో మధ్యలోనే ఆగిపోయిన మ్యాచ్‌లో దిల్లీ బౌలర్లను.. పంజాబ్ ఓపెనర్లు ఉతికారేశారు. 10.1 ఓవర్లలోనే 122 పరుగులు చేశారు. దీంతో ప్లేఆఫ్స్ వేళ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలపై ఆ జట్టు మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం వచ్చింది. ఇక ఐపీఎల్‌కు విరామం రావడంతో స్వదేశానికి వెళ్లిపోయిన దిల్లీ ప్రధాన పేసర్ మిచెల్ స్టార్క్ తిరిగి భారత్‌కు రాకూడదని నిర్ణయించుకోవడం దిల్లీకి పెద్ద ఎదురుదెబ్బ. ఈ సీజన్లో ఆ జట్టు తరఫున ఉత్తమ బౌలర్ స్టార్కే. అతడు 14 వికెట్లు తీశాడు. తాత్కాలికంగా ఐపీఎల్‌లో ఆడే అవకాశాన్ని దక్కించుకున్న బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ దిల్లీకి ఎలా ఉపయోగపడతాడో చూడాలి. ఇక ఈ మ్యాచ్‌లో గుజరాత్ విజయం సాధిస్తే.. అధికారికంగా ప్లేఆఫ్స్ బెర్తు సొంతం చేసుకుంటుంది.

## 'ధోనీకి మాత్రమే రియల్ ఫ్యాన్స్.. మిగిలినందరికీ ఉన్నది పెయిడ్ ఫ్యాన్సే'



క్రికెటర్ల ఫ్యాన్ బేస్‌పై భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. టీమిండియా దిగ్గజం ఎంఎస్ ధోనికి మాత్రమే నిజమైన అభిమానులు ఉన్నారని, మిగతా క్రికెటర్లందరికి ఉన్నది పెయిడ్ ఫ్యాన్సేనని భజ్జీ వివాదస్పద కామెంట్స్ చేశాడు. ఆర్సీబీ, కేకేఆర్ మ్యాచ్ సందర్భంగా స్టార్ స్పోర్ట్స్ ఛానెల్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో హర్భజన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. కాగా ఐపీఎల్-2025 తర్వాత ధోనికి రిటైర్ అయ్యే ఆలోచన లేదని ఇప్పటికే తన నిర్ణయాన్ని సీఎస్‌కే యాజమాన్యానికి తెలియజేశాడని శనివారం వార్తలు వినిపించాయి. ఈ క్రమంలోనే హర్భజన్ తన మనసులోని మాటను బయటపెట్టాడు. "ఎంఎస్ ధోని తను ఎప్పటివరకు ఆడాలనుకుంటే అప్పటి వరకు ఐపీఎల్‌లో కొనసాగుతాడు. ఒకవేళ సీఎస్‌కే యాజమాని నేనే అయితే ధోని విషయంలో వేరే నిర్ణయం తీసుకునేవాడిని. నా వరకు అయితే.. ధోనికి ఒక్కడికే అసలైన అభిమానులు ఉన్నారు. మిగిలిన క్రికెటర్లందరికి సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఉన్నారు. అందులో కూడా కొంతమంది పెయిడ్ ఫ్యాన్సే. వారి గురించి మాట్లాడటం అనవసరం. అటువంటి వారి మాట్లాడితే ఈ చర్చ పక్కదారి పడుతుంది" అని హార్భజన్ క్రిక్‌బజ్ షోలో పేర్కొన్నాడు. ఈ క్రమంలో హార్భజన్ అనుచిత వ్యాఖ్యలపై విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. ధోనిని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతున్నారు. ఎంఎస్ ధోని దేశద్రోహి అంటూ ఎక్స్‌లో ప్రచారం చేస్తున్నారు.



# ఇద్దరు హీరోయిన్లతో నవీన్ చంద్ర కొత్త చిత్రం

హీరో నవీన్ చంద్ర వరుస సినిమాలతో దూసుకెళ్తున్నాడు. ఈ మధ్య లెవన్ సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఈ టాలెంటెడ్ హీరో..తాజాగా మరో కొత్త సినిమాను ప్రకటించాడు. ఈ చిత్రానికి 'కరాలి'అనే టైటిల్ ఫిక్స్ చేశారు. రాకేష్ పొట్టా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీమతి మందలపు ప్రవల్లిక సమర్పణలో విక్రాంత్ ఫిల్మ్ క్రియేషన్స్ బ్యానర్ మీద మందలపు శివకృష్ణ నిర్మిస్తున్నారు. రాశీసింగ్, కాజల్ చౌదరి హీరోయిన్లు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత సాహు గారపాటి, రాజా రవీంద్ర వంటి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిత్ర యూనిట్‌కు సాహు గారపాటి స్క్రిప్ట్‌ను అందజేశారు. ముహూర్తపు సన్నివేశానికి సాహు గారపాటి క్లాప్ కొట్టగా, శ్రీహర్షిణి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత గోరంట్ల రవికుమార్, యాస్పైర్ స్పేసెస్ మేనేజింగ్ డైరెక్టర్ తుమాటి నరసింహా రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నవీన్ చంద్ర మాట్లాడుతూ... 'కొత్త వారు కొత్త పాయింట్‌తో వచ్చినప్పుడు సినిమాలు నిర్మించేందుకు శివ గారి లాంటి ధైర్యం ఉన్న వాళ్లు ముందుకు రావాలి. 'కరాలి' అనే టైటిల్ ఎంత కొత్తగా, డిఫరెంట్‌గా ఉందో సినిమా కూడా అంతే కొత్తగా ఉంటుంది. ఇంత వరకు నేను చేయని ఓ డిఫరెంట్ యాక్షన్ డ్రామా. కాజల్ చౌదరి నటించిన 'అనగనగా' ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. మా సినిమాకు మంచి టీం దొరికింది. ఇంత వరకు నన్ను ఆడియెన్స్, మీడియా ఎంకరేజ్ చేస్తూనే వచ్చింది. ఈ మూవీని ఆడియెన్స్ అంతా ఎంజాయ్ చేసేలా రూపొందిస్తున్నామ'ని అన్నారు. 'నేను చెప్పిన స్క్రిప్ట్ నచ్చడంతో నిర్మించేందుకు వచ్చిన శివ గారికి థాంక్స్. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందని మేం చాలా నమ్మకంగా ఉన్నాం' అని చిత్ర దర్శకుడు రాకేష్ పొట్టా అన్నారు. నాకు స్క్రిప్ట్ చాలా నాకు నచ్చింది. నవీన్ చంద్ర గారి సినిమాలు, ఆయన ఎంచుకునే కథలు ఎలా ఉంటాయో చెప్పాల్సిన పని లేదు. మళ్లీ ఈ మూవీతో మంచి కథతో మీ అందరి ముందుకు రాబోతోన్నాం'అని హీరోయిన్ కాజల్ చౌదరి అన్నారు.

# తెలుగులో విజయ్ సేతుపతి 'ఏస్'


విజయ్ సేతుపతి హీరోగా, రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఏస్'. అరుముగ కుమార్ దర్శకత్వంలో 7సీఎస్ ఎంటర్‌టైన్మెంట్స్‌పై అరుముగ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదల కానుంది. ఈ చిత్రం తెలుగు విడుదల హక్కుల్ని శ్రీ పద్మిణి సినిమాస్ దక్కించు కుంది. పద్మ సమర్పణలో శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్‌పై బి. శివప్రసాద్ ఈ సినిమాని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయనున్నారు. "ఏస్' కోసం ప్రముఖ ప్రొడక్షన్ కంపెనీలు పోటీ పడినా తెలుగు విడుదల హక్కులను మేము దక్కించుకోవడం సంతోషంగా ఉంది. ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు భాషల్లో ఈ నెల 23న రిలీజ్ చేయబోతున్నాం" అన్నారు బి. శివ ప్రసాద్.





# ఎట్టకేలకి తన పెళ్లి గురించి క్లారిటీ ఇచ్చిన విశాల్.. త్వరలోనే లవ్ మ్యారేజ్

తమిళ నటుడు విశాల్ తెలుగు ప్రేక్షకులకి కూడా చాలా సుపరిచితం. పందెం కోడి చిత్రంతో ఆయన టాలీవుడ్ ప్రేక్షకులకి దగ్గరయ్యారు. ఇప్పటికీ వైవిధ్యమైన సినిమాలు చేస్తూ తన ప్రతి సినిమాని తెలుగులో రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఇటీవల మద గజ రాజా అనే కామెడీ చిత్రంలో నటించారు. ఈ సినిమా మంచి విజయం సాధించింది. అయితే ఇటీవల విశాల్ పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు అనేక వార్తలు వచ్చాయి. అందుకు కారణం కొన్ని రోజుల క్రితం విశాల్ గుర్తు పట్టలేని విధంగా చాలా వీక్‌గా కనిపించి అందరికి షాక్ ఇచ్చారు. ఆ తర్వాత కోలుకున్న ఆయన మిస్ కువాగం, ట్రాన్స్‌జెండర్ బ్యూటీ కాంటెస్ట్ కు గెస్ట్ గా వెళ్లాడు. ఈవెంట్ జరుగుతున్న సమయంలో ఉన్నట్టుండి వేదికపైనే కుప్పకూలిపోయాడు విశాల్. ఆ సమయంలో విశాల్‌ని దగ్గర్లోని ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ఆ తర్వాత మళ్లీ ఆ షోకు వెళ్లి ఈ కార్యక్రమాన్ని సక్సెస్ చేశారు. ఆహారం సరిగా తీసుకోకపోవడం వల్ల స్పృహ తప్పి పడిపోయారని, ఎండ, వేడి, ఉక్కపోతతో.. ఒక్కసారిగా నీరసం అయి అలా కుప్పకూలాడని అన్నారు. అయితే ప్రస్తుతం విశాల్ ఆరోగ్యంగానే ఉన్నాడు. ఇక విశాల్ పెళ్లి వార్తలు కొద్ది రోజులుగా నెట్టింట హల్‌చల్ చేస్తుండడం మనం చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఆయన పెళ్లిపై స్పందించారు. విశాల్ మదురై మీనాక్షి అమ్మవారి దర్శనానికి వచ్చారు. "చెంగల్పట్టు జిల్లా కార్యదర్శి సతీష్ కుమార్ పెళ్లి కోసం మదురై వచ్చా. మీనాక్షి అమ్మవారిని దర్శించుకోకుండా ఎలా వెళ్లగలను? అమ్మ ఇచ్చిన పట్టుచీరను అమ్మవారికి సమర్పించి దర్శనం చేసుకున్నాను అని చెప్పారు. ఇక నటుల సంఘం భవనం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయ్యాకే పెళ్లి చేసుకుంటానని విశాల్ చెప్పారు. భవనం త్వరలో ప్రారంభం కానుండటంతో, తన పెళ్లి త్వరలో జరుగుతుందని ప్రకటించారు. కొంతకాలంగా ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నానని, ఆమెతో త్వరలో పెళ్లి జరుగుతుందని విశాల్ తెలిపారు. రెండు నెలల్లో నటుల సంఘం భవన నిర్మాణం పూర్తయి, ప్రారంభోత్సవం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్‌లో పెళ్లి జరుగుతుందని విశాల్ చెప్పారు.



# టాలీవుడ్ యువ దర్శకుడికీ లక్కీ ఛాన్స్?

ఒకప్పటితో పోలిస్తే సీనియర్ హీరోలు.. ప్రస్తుతం యువ దర్శకులతో పనిచేసేందుకే ఎక్కువ ఇష్టపడుతున్నారు. ట్రెండ్ కి తగ్గ స్టోరీలతో మూవీస్ చేస్తుండటమే ఇందుకు కారణం. ఇ?ప్పుడు అలా సూపర్ స్టార్ రజినీకాంత్.. ఓ తెలుగు యువ దర్శకుడితో కలిసి పనిచేయబోతున్నారనే న్యూస్ బయటకొచ్చింది. పస్తుతం లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చేస్తున్న రజినీకాంత్.. మరోవైపు నెల్సన్ తీస్తున్న 'జైలర్ 2' కూడా చేస్తున్నారు. దీని తర్వాత ఇంకా ఎవరికీ కమిట్ మెంట్ ఇవ్వలేదు. అలానే తెలుగు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ దగ్గర రజినీ డేట్స్ ఉన్నాయి. ఈ క్రమంలోనే రీసెంట్ గా వివేక్ ఆత్రేయ వెళ్లి ఆయనకు కథ చెప్పాడని తెలుస్తోంది.

2017లో 'మెంటల్ మదిలో' అనే సినిమాతో వివేక్ ఆత్రేయ దర్శకుడిగా పరిచయమయ్యాడు. తర్వాత 'బ్రోచేవారెవరురా' తీశాడు. నానితో అంటే సుందరానికీ, సరిపోదా శనివారం చిత్రాలగ్నీ తెరకెక్కించాడు. కేవలం నాలుగే సినిమాలు తీసిన అనుభవమున్న వివేక్.. ఒకవేళ రజినీతో మూవీ చేస్తే మాత్రం జాక్ పాట్ కొట్టినట్లే.

# విడుదలకు సిద్ధమైన సినిమాను ఆపేద్దామన్నారు.. కానీ



ఇంటర్నెట్ డెస్క్: తాను నటించిన ఓ సినిమాని విడుదల చేయకుండా ఆపేద్దామని నిర్మాతలు అనుకున్నారని విజయ్ దేవరకొండ తెలిపారు. సంగీత దర్శకుడి మార్పుతో సినిమాపై నమ్మకం కలిగి రిలీజ్ చేసినట్టు చెప్పారు. కొత్త మూవీ 'కింగ్డమ్' ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఆ విషయాలు పంచుకున్నారు. ఆ చిత్రం మరేదో కాదు 'టాక్సీవాలా' "దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ 'టాక్సీవాలా' స్క్రిప్ట్ వినిపిస్తున్నప్పుడే బాగా నవ్వుకున్నా. వెంటనే సినిమా చేసేద్దాం అని చెప్పా. ప్రతి సన్నివేశం చిత్రీకరణ పూర్తయ్యాక మానిటర్‌లో అవుట్‌పుట్ చూసినప్పుడూ నవ్వులే. ఎడిటింగ్ పూర్తయింది. సినిమా విడుదలకు సిద్ధంగా ఉన్న సమయంలో.. నేను చెన్నైలో 'నోటా' మూవీ షూటింగ్‌లో ఉన్నా. 'టాక్సీవాలా' ఫైనల్ అవుట్‌పుట్ చూసిన నిర్మాతలు నాకు ఫోన్ చేసి వెంటనే హైదరాబాద్ రమ్మన్నారు. వాళ్ల వాయిస్‌లోని సీరియస్‌నెస్ అర్థమైంది. ఏం జరిగిందోనని టెన్షన్ పడ్డా. హైదరాబాద్ రాగానే అల్లు అరవింద్ గారిని కలిశా. 'ఇది వర్కౌట్ కాదు. ఆపేద్దాం. తదుపరి సినిమాని గ్రాండ్‌గా రిలీజ్ చేద్దాం' అని అన్నారు. నేను షాక్ అయ్యా. మరోసారి చూద్దాం సర్ అని విజ్ఞప్తి చేశా. అలా సినిమా చూసిన నాకూ నవ్వు రాలేదు. సినిమా జానర్‌కు నేపథ్య సంగీతం పూర్తిభిన్నంగా ఉండడమే దానికి కారణం. 'నేను, దర్శకుడు మరో మ్యూజిక్ డైరెక్టర్‌ని సెట్ చేస్తాం. సమయం ఇవ్వండి' అని అరవింద్ సర్‌కి చెప్పా. సంగీత దర్శకుడు జేక్స్ బెజోయ్‌ని కలిసి సినిమా నేపథ్యం వివరించాం. అతడి నేపథ్య సంగీతం సినిమా విజయానికి కారణమైంది" అని విజయ్ పేర్కొన్నారు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,